సోమవారం
22-12-2025
విజయవాడ ప్రచురణ
సంపుటి : 74, సంచిక : 181
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మాక్రాన్‌తో చర్చలకు పుతిన్ సిద్ధం

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శాంతి చర్చల విషయంలో సానుకూలంగా ఉన్నారని క్రెమ్లిన్ తెలిపింది. పరస్పర రాజకీయ ఉద్దేశం ఉన్నట్లయితే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌తో చర్చలకు పుతిన్ సిద్ధమంటూ క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిని సానుకూలంగా పరిగణించవచ్చని అన్నారు. అయితే చర్చలకు పుతిన్ ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు ఫ్రెంచ్ అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. ఏయే షరతుల ఆధారంగా చర్చలు జరపాలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది.

'వీబీజీ రామ్‌జీ'కి రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీజీ ఆర్‌ఏఎం జీ) బిల్లు-2025ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన వారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. గతంలో 100 రోజుల పనికి హామీ కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో వీబీ-జీ ఆర్‌ఏఎం జీని మోదీ

- మిగతా 2 లో

16 ఎప్‌స్టీన్ ఫైళ్లు మాయం!

న్యూయార్క్: రాజకీయ నాయకులు సహా అనేక మంది ప్రముఖుల గుట్టు బయట పెట్టిన ఎప్‌స్టీన్ ఫైళ్లు అమెరికాను కుదిపివేస్తున్నాయి. వీటిని న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసింది. అయితే 16 ఫైళ్లు గుట్టు చప్పుడు కాకుండా మాయమైనట్లు తెలుస్తోంది. ఇదే అంశమై డెమొక్రాట్లు ఆరోపణలు చేశారు. మాయమైన ఫైళ్లలో అధ్యక్షుడు ట్రంప్ ఫోటోలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓ అమ్మాయితో ట్రంప్ ఉన్న ఆ ఫోటోకు సంబంధించిన 468 అనే నంబరుగల ఫైలు అదృశ్యమైనట్లు తెలిపారు. ఇలా

- మిగతా 2 లో

దక్షిణాఫ్రికాలో కాల్పులు... 9 మంది మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో ఓ సాయుధుడు రెచ్చిపోయాడు. విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రాజధాని జొహన్నెస్‌బర్గ్ శివార్లలోని బెకర్స్‌డాల్ టౌన్‌షిప్‌లో ఈ దారుణం ఆదివారం జరిగింది. కాల్పుల శబ్దాలకు ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ దాడికి కారణం తెలియలేదని పోలీసులు

- మిగతా 2 లో

రైల్వే చార్జీల బాదుడు

26 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: అధిక ధరలతో సతమతమవుతున్న పేదలు, మధ్య తరగతి ప్రజలపై మరో భారం మోపేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైంది. ఆదాయం సముచితంగా లేక, ఖర్చులు పెరిగి, కష్టం మీద బతుకు బండి లాగుతున్న ప్రజల జేబుకు మరో చిల్లు పడబోతోంది. రైల్వే ప్రయాణం సైతం మరింత ప్రియంగా మారిపోతోంది. ఈ ఏడాది జులైలో రైలు టికెట్ ధరలను పెంచిన రైల్వేశాఖ ఇప్పుడు మళ్లీ చార్జీలు పెంచబోతోంది. ఈనెల 26 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి వస్తాయని భారతీయ రైల్వేశాఖ ప్రకటించింది. లోకల్, స్వల్ప దూర ప్రయాణాల టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని రైల్వే శాఖ పేర్కొంది. అయితే. ఆర్డినరీ క్లాస్‌లో 215 కి.మీల కంటే తక్కువ దూరానికి చార్జీలు పెంచలేదు. దూరం పెరిగితే కిలోమీటరకు పైసా చొప్పున ఆర్డినరీ క్లాస్ టికెట్ ధరను పెంచింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఏసీ, నాన్-ఏసీ రైళ్ల టికెట్ ధరలపై కిలోమీటరకు రెండు పైసలు చొప్పున పెంచింది. నాన్-ఏసీ రైళ్లలో 500 కి.మీల దూరానికి రూ.10 అదనంగా ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. సబర్బన్ రైళ్ల మంత్రీ సిజన్ టికెట్ల చార్జీలు పెంచడం లేదని రైల్వేశాఖ వెల్లడించింది. ఇలా చార్జీలు పెంచడం ద్వారా 2026, మార్చి 31 నాటికి రైల్వేకు అదనంగా రూ.600 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జులైలో పెంచిన చార్జీలతో ఇప్పటివరకు రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందని రైల్వేశాఖ తెలిపింది. దూర ప్రాంతాల ప్రయాణికులకు తప్ప రోజువారీ, తక్కువ దూరం ప్రయాణికులపై కొత్త చార్జీల ప్రభావం ఉండదని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. కార్యకలాపాల ఖర్చులు బ్యాలెన్స్ చేసుకుంటూ ఎక్కువ మంది ప్రయాణికులకు సరసమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో నిర్వహణ వ్యయం గణనీయంగా పెరిగిందని, కార్మికశక్తి వ్యయం రూ.1,15 లక్షల కోట్లకు, పింఛన్ వ్యయం రూ.60వేల కోట్లకు చేరుకుందని రైల్వే తెలిపింది. 2024-25లో మొత్తం ఖర్చు రూ.2.63 లక్షలకోట్లు అయిందని వెల్లడించింది.

అణచివేత, అన్యాయం, దోపిడీని

ప్రతిఘటిద్దాం

ప్రజలకు భరోసా ఎర్ర జెండా

సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

చత్తీస్‌గఢ్‌లో ఘనంగా శతాబ్ది వేడుక

జగదల్‌పూర్‌లో అరుణ ర్యాలీ- బహిరంగ సభ

జగదల్‌పూర్: 'అణచివేతను ప్రతిఘటిద్దాం... దోపిడీని అడ్డుకుందాం... అన్యాయాన్ని ఎదిరిద్దాం' అంటూ చత్తీస్‌గఢ్ వేదికగా సీపీఐ పిలుపునిచ్చింది. ఎప్పుడు ఎక్కడ అన్యాయం జరిగినా ఎర్ర జెండా అండగా నిలుస్తుందని వక్తలు నొక్కిచెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు సీపీఐ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని, నిబద్ధతతో ముందుకు సాగుతోందని వక్కాణించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవంలో భాగంగా చత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ అరుణశోభను సంతరించుకుంది. ఎర్ర జెండాలతో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ జరిగాయి. సీపీఐ కార్యదర్శి, ఎంపీ పి.సంతోశ్ కుమార్, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కార్యదర్శి కె.సజీతో పాటు అనేక మంది అగ్రస్థాయి నాయకులు ప్రసంగించారు. నక్సలిజంపై పోరు నెపంతో అమాయక గిరిజనులను లక్ష్యం చేసుకుంటున్నారని, ఆపరేషన్ కగార్ పేరిట మారణహోమం సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామిక హక్కులు, జీవనోపాధులు, గౌరవ జీవితానికి ఉన్న హామీని అణచివేస్తుండటంపై రాజీ లేని పోరాటం చేస్తామని ప్రకటించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సావాన్ని పురస్కరించుకొని జగదల్‌పూర్‌లో అరుణ పతకాలతో సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనులు, గిరిజనయేతరులు భుజం భుజం కలిపి ముందుకు సాగారు. ఎర్ర జెండాలు చేబూని కదం

- మిగతా 2 లో

అణు బిల్లుతో దేశ రక్షణ వ్యవస్థకు నష్టం

- నక్సలైట్లు... రౌడీ షీటర్లు ఒకటే అనే పవన్ ధోరణి సరికాదు
- చంద్రబాబు కేంద్రం మెడలు వంచి నిధులు తేవాలి
- సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : అణు ఒప్పందం బిల్లుతో దేశ రక్షణ వ్యవస్థకు నష్టమని, కేంద్రంలోని మోదీ సర్కార్ పార్లమెంటులో అణు బిల్లును ప్రవేశపెట్టి చట్ట సభ పరువు తీసిందని సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఆదివారం నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణు ఒప్పందాన్ని ప్రపంచంలో అన్ని దేశాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. అయితే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇష్టానుసారంగా అణు పరిశ్రమలను కూడా ప్రైవేటీకరణ చేయడం వల్ల భారతదేశ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే దేశంలో భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. అణు విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ రంగాలను పణంగా పెట్టి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవద్దని నారాయణ అన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి అందుబాటులో ఉన్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నక్సలైట్లు రౌడీ షీటర్లు ఒకటే అనే ధోరణిలో మాట్లాడటం సరికాదన్నారు. నక్సలైట్లు దేశంలో బడుగు, బలహీన, పేద వర్గ ప్రజల అభ్యున్నతి కోసం పోరాటం చేసి తమ జీవితాలను పణంగా పెట్టారని, అలాంటి

- మిగతా 2 లో

ఉపాధికి తూట్లు

- కేంద్రం వాటా కుదింపుతో చట్టం నిర్వీర్యం
- రాష్ట్రం నెత్తిన ఏటా రూ.4 వేల కోట్ల భారం
- కష్టజీవులు, వ్యవసాయ కూలీలకు నష్టం
- వలసలు భారీగా పెరిగే ప్రమాదం
- కేంద్రంపై టీడీపీ, జనసేన ఒత్తిడి తేవాలి
- ఎంజీఎన్ఆర్ఈజీఏ యథాతథంగా కొనసాగించాలి
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా పది వామపక్ష పార్టీల నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కు కేంద్రం చేసిన సవరణలపై పెద్ద ఎత్తున తిరుగుబాటు మొదలైంది. దీనివల్ల రాష్ట్రంపై ప్రతి ఏటా దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. మోదీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టం యథాతథంగా కొనసాగేలా చూడాలని డిమాండ్ చేస్తూ... సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా

- మిగతా 2 లో

ఉగాదికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా 10.42 లక్షల దరఖాస్తులు

81వేల మందికి ఇళ్ల స్థలాలు అవసరమని గుర్తింపు

ప్రభుత్వ పోరంబోకులో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్రంలో వచ్చే ఉగాది నాటికి 5లక్షల గృహాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా నిర్మాణ దశలోని గృహాలను జియో ట్యాగింగ్ చేయడానికి మొబైల్ యాప్ ను రూపొందించారు. ప్రతి దశలో బిల్లు విడుదల, వచ్చే ఉగాది (2026) నాటికి ఇళ్లు పూర్తి చేసే విషయమై లబ్ధిదారులకు తెలుగులో ఎస్ఎంఎస్ అలర్ట్‌లు పంపించారు. వచ్చే ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందులో ఇప్పటికే 3.00 లక్షల గృహాలను పూర్తి చేయగా... మిగిలిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అంటే ఇన్నాళ్ళూ ఈయన మన భూములతోనూ, కోర్పరేట్లతోనూ బిజినెస్ చేసాడా ఏంది?

ఈడురాని అమ్మాయిలపై అఘాయిత్య తబ్సీళ్లు

ఆర్వీ రామారావ్

ఈడు రాని వేలాది మంది అమ్మాయిల లైంగిక పీడనకు కారకుడన ఎపిస్టీన్ ఫైళ్లు విడుదలయ్యాయి. దీనితో అమెరికాలో అల్లకల్లోలం చెలరేగింది. అమెరికా ఆత్మ క్షోభిస్తోంది. ఈడు రాని అమ్మాయిలతో కామకలాపాల వ్యవహారంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు కూడా సంబంధం ఉందన్న వార్తలు గుప్పుమన్నాయి. ట్రంప్ ఎపిస్టీన్ తీసుకొచ్చిన ఈడు రాని అమ్మాయిలతో గంటలకొద్దీ కాలక్షేపం చేశారన్న మాట వినిపిస్తోంది. మన దేశంలోని కొందరు ప్రముఖ నాయకుల పేర్లు కూడా ఈ వ్యవహారంలో ఉన్నాయంటున్నారు.

ఈ లైంగిక కాండకు సంబంధించి అనేక ఫోటోలు బయటకొచ్చాయి. కేవలం ఫోటోలు ఎవరి లైంగిక అపరాధాలకూ రుజువులు కాకపోవచ్చు. కానీ అనుమానాలకు ఆస్కారం మాత్రం ఉంటుంది. ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త నోం చాంస్కీ పేరు కూడా ఎపిస్టీన్ ఫైళ్లలో ఉంది. చాంస్కీ అంతర్జాతీయంగా ప్రఖ్యాతుడైన రాజకీయ విశ్లేషకుడు కూడా.

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు బిల్ గేట్స్ తో పాటు బ్రిటిష్ రాజ కుటుంబంలోని అనేక మంది పేర్లు ఈ నీలి క్రీడతో ముడిపడి ఉన్నాయి. బిల్ గేట్స్ ప్రభుత్వాలకే విరాళాలు ఇచ్చేంత సంపన్నుడు. దాత. ఈ ఆరోపణల గురించి బిల్ గేట్స్ ను అడిగితే ఇప్పటిదాకా ఉలుకూ పలుకూ లేదు.

ఈ అంశంపై అమెరికా పార్లమెంటులో పెద్ద దుమారం రేగింది. ఈ ఫైళ్లను బయటపెట్టాలని ఒత్తిడి చేశారు. ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్లమెంటు సభ్యులే కాకుండా అధికారంలో ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎంపీలు కూడా గట్టిగా కోరారు. ఈ అంశంపై అమెరికా పార్లమెంట్ లో ఓటింగ్ జరిగితే 427 మంది ఫైళ్లు

బయట పెట్టడానికి అనుకూలంగా ఓట్లు వేశారు. ఒక్కరు మాత్రమే వ్యతిరేకించారు.

ఈ లైంగిక కుంభకోణానికి సంబంధించి తొలి విడతగా 70 ఫొటోలు బయటకొచ్చాయి. వివిధ దేశాల నుంచి అనేకమంది అమ్మాయిలను అపహరించో, బెదరించో, లొంగదీసుకునో ఈ కుంభకోణం నడిపారు. మొత్తం 95 వేల ఫోటోలు ఉన్నాయట. అవీ క్రమంగా విడుదల కావొచ్చు.

ఈ లైంగిక దాడికి గురైన వారి శరీరాల మీద రష్యా రచయిత వ్లాదిమిర్ నొబకోవ్ రాసిన నవలలోని పంక్తులు రాశారు. ఈడు రాని అమ్మాయిని వేధించడం గురించి నొబకోవ్ ఈ నవల రాశారు. రష్యా, మొరాకో, ఇటలీ, దక్షిణాఫ్రికా, ఉక్రేన్, లిథువేనియా నుంచి అపహరణకు గురైన అమ్మాయిల ప్రస్తావన క్రమంగా బయటకొస్తోంది.

గత జులైలో ఎపిస్టీన్ ఫైల్స్ కు సంబంధించి వాల్ స్ట్రీట్ జర్నల్ లో ఈ వార్త ప్రచురితం అయింది. అందులో ట్రంప్ పాత్ర గురించిన సమాచారమూ ఉంది. ట్రంప్ ఆ పత్రికపై పరువు నష్టం దావా కూడా వేశారు.

ఎపిస్టీన్ అప్పులిచ్చే మనిషి. ఆయనకు అత్యంత సంపన్నులతో, వివిధ దేశాల నాయకులతో సంబంధాలు ఉండేవి. ఆయన ఇచ్చే పార్టీలలో చాలా మంది ప్రముఖులు, సంపన్నులు, వివిధ దేశాల నేతలు పాల్గొనే వారు.

పత్రికా రచయిత్రి జూలీ కె.బ్రౌన్ ఏడాది పాటు పరిశోధించి మూడు విడతలుగా ఈ కుంభకోణాన్ని బయట పెట్టారు. తరవాత ఆమె ఈ వార్తా కథనాలను "పెర్వర్షన్ ఆఫ్ జస్టిస్" గ్రంథంగా కూడా ప్రచురించారు. ఆమె కథనాలన్నీ మియామీ హెరాల్డ్ పత్రికలో ప్రచురితం అయినాయి. ఇది 122 ఏళ్ల నాటి పత్రిక. దాదాపు 80 కథనాలను బ్రౌన్ ప్రచురించారు.

ఈ పత్రిక బ్రౌన్ కథనాల మీద లోతైన పరిశోధించి లైంగిక శోషణకు గురైన 80 మంది అమ్మాయిలను, మహిళలను గుర్తించింది. ఇందులో 60 మంది ఎక్కడ ఉంటారో కూడా కనిపెట్టారు. ఇందులో ఎనిమిది మంది తమను ఇంటర్వ్యూ చేయడానికి అంగీకరించారు. ఎపిస్టీన్ పథకంలో

- మిగతా 2 లో

‘ఉపాధి’ ప్రాథమిక స్వభావం మారిపోయింది



వీబీ జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళన

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : గ్రామీణ పేదలకు ఉపాధి హామీ కల్పించే ఎంజీఎన్ఆర్ఈజీఏ కు చెందిన ప్రాథమిక స్వభావం మారిపోయిందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ఆదివారం తెలిపారు. పార్లమెంటులో ఆమోదించబడిన రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ-రామ్-జీ) బిల్లుకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాలలో దేశ వ్యాప్తంగా ఉద్యమానికి కార్యాచరణ ప్రణాళికను డిసెంబరు 27న జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఖరారు చేస్తుందని ఆయన ప్రకటించారు. ఏఎస్ఐ వార్తా సంస్థతో జైరాం రమేశ్ మాట్లాడుతూ కొత్త చట్టం సమాజంలోని గ్రామీణ, అణగారిన, దోపిడీకి గురైన వర్గాల నుంచి ఉపాధి అవకాశాలను తీసివేసిందని అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ ప్రాథమిక స్వరూపం మార్చబడిందని తెలిపారు. ఉపాధి కల్పించడం, స్థిరమైన జీవనోపాధిని నిర్ధారించడానికి ఉపాధి ద్వారా స్థానిక మౌలిక సదుపాయాలను సృష్టించడం, గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్ణయం తీసుకోవడం అనే మూడు కీలక సూత్రాలపై ఎంజీఎన్ఆర్ఈజీఏ ఆధారపడి ఉందని ఆయన వివరించారు. ‘గతంలో దీనిని గ్రామ పంచాయతీ నిర్ణయించేది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎవరికి, ఎక్కడ, ఎప్పుడు ఉపాధి కల్పించాలో నిర్ణయిస్తుంది’ అని చెప్పారు. బీజేపీ సైద్ధాంతిక పక్షపాతంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ‘వారు మహాత్మా గాంధీ పేరును ద్వేషిస్తారు. కాంగ్రెస్ పాలనలో చేసిన చట్టాలను వారు ద్వేషిస్తారు. వారు దీన్ని ఎందుకు తొందరపడి చేశారో నాకు అర్థం కాలేదు’ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా చట్టం రూపొందించబడిందని, ఈ చర్య రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీస్తుందని తెలిపారు. ‘పార్లమెంటుపై బుల్డోజర్‌ను నడిపారని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ చేసిన ప్రకటన సరైనది’ అని అన్నారు. ఇంకా పార్లమెంటరీ ప్రక్రియలో పార్టీ తన అభ్యంతరాలను లేవనెత్తిందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ‘మేము సమస్యలను లేవనెత్తాము. పార్లమెంటులో ప్రశ్నలు అడిగాము. చర్చలో పాల్గొన్నాము. అభ్యంతరాలను లేవనెత్తాము. మా ఆందోళనలు, అభ్యంతరాలన్నింటినీ మేము వివరంగా సమర్పించాము’ అని తెలిపారు. కొత్త బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా ఆందోళనను ప్రారంభించడానికి సిద్ధమవుతోందని జైరాం రమేశ్ పేర్కొంటూ, 27న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుందని, అక్కడ పార్టీ ప్రతిపాదిత ఉద్యమం స్వభావాన్ని చర్చిస్తుందని అన్నారు. ‘ఈ అంశంపై ఎలాంటి ప్రజా ఉద్యమం ప్రారంభించబడుతుందో మేము చర్చిస్తాము. ఒక కార్యాచరణ ప్రణాళిక కచ్చితంగా ఉద్భవిస్తుంది. ఇది అన్ని రాష్ట్రాలలో జాతీయ ఉద్యమం అవుతుంది’ అని చెప్పారు. ‘ఒకవైపు, ప్రధాన మంత్రి గ్రామ పంచాయతీ గురించి మాట్లాడుతారు. కానీ కేంద్రీకరణకు సంబంధించి వారు ఆచరణలో ఏమి చేస్తారు? వారి మాటలకు, వారి చర్యలకు మధ్య చాలా తేడా ఉంది’ అని అన్నారు.

బంగ్లా సైన్యాన్ని దెబ్బతీసేందుకు పాక్ ఐఎస్ఐ కుట్ర

నిఘా నివేదికలో సంచలన విషయాలు

ఢాకా: బంగ్లాదేశ్ నేడు ప్రమాదకర స్థితిలో ఉంది. అక్కడి రాడికల్ ఇస్లామిక్ శక్తులు ఆ దేశాన్ని కబ్జా చేయాలని చూస్తున్నాయి. అంతర్గత వర్గ పోరును కూడా భారత్‌కు ముడిపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా రాడికల్ ఇస్లామిస్ట్ విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హాది హత్యను పేర్కొనవచ్చు. దీంట్లో భారత ప్రమేయం ఉందని చెబుతూ, అక్కడి మతోన్మాద మూక ఢాకాలోని భారత ఎంబసీపై దాడి యత్నం చేసింది. రాజకీయ, మత శక్తులు తమ ప్రయోజనం కోసం ప్రభుత్వ సంస్థల్ని ఉద్దేశపూర్వకంగా బలహీన పరుస్తున్నాయని ఓ నిఘా నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా, బంగ్లాదేశ్ ఆర్మీని బలహీనపరచాలని పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కుట్ర చేస్తోందని నివేదికలో పేర్కొంది. భారత వ్యతిరేక శక్తులు, రాడికల్ ఇస్లామిక్ శక్తులు దీన్ని ఉపయోగించుకుంటున్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీని బలహీనపరిచే కుట్ర దాగున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూనస్ ప్రభుత్వం, మతోన్మాద సంస్థలైన జమాతే ఇస్లామి వంటి సంస్థలు యాంటీ-ఇండియా కథనాన్ని రూపొందిస్తున్నప్పటికీ, బంగ్లా సైన్యంతో భారత్ సంప్రదింపులు జరుపుతూనే ఉంది. ముఖ్యంగా, షేక్ హసీనా పదవీచ్యుతి సందర్భంలో బంగ్లా ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్, భారత ఆర్మీ చీఫ్‌తో మాట్లాడారు. ఇది భారత వ్యతిరేకులకు నచ్చడం లేదు. బంగ్లా సైన్యంలో మధ్యస్థాయి అధికారుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. పోలీస్ వ్యవస్థ దాదాపు నిష్క్రియంగా ఉంది. సైన్యం అయిష్టంగానే మొదటి ప్రతిస్పందనదారుడి పాత్రను పోషిస్తోంది. మధ్య స్థాయి అధికారులు తమకు స్పష్టమైన రాజకీయ మద్దతు, చట్టపరమైన రక్షణ లేదని ఫిర్యాదు చేస్తున్నారు. వీధుల్లో పరిస్థితిని నిర్వహిస్తున్నప్పటికీ, ప్రతీ నిర్ణయం భవిష్యత్తులో ప్రతీకారం తీర్చుకుంటారనే భయానికి లోబడి ఉంది. ఇది సైన్యంలో నైతికతను క్షీణించేలా చేస్తోంది. పాకిస్థాన్ నిఘా సంస్థ, ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), బంగ్లాదేశ్ సైనిక నిర్మాణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. వివిధ స్థాయిలో గందరగోళం సృష్టిస్తోందని నిఘా వర్గాలు సూచిస్తున్నాయి. ఈ జోక్యం సైన్యం ఐక్యత, విశ్వాసాన్ని దెబ్బతీసి, అస్థిరతకు కారణం అవుతోంది. అల్లర్లు, దుండగులపై చర్యల విషయంలో వివక్ష అనే భావన సైన్యంలో పెరుగుతోంది. భారత్ వంటి పెద్ద దేశాన్ని, బంగ్లాదేశ్ వంటి బురద పాము ఏం చేయలేదు... కానీ పరిస్థితులు అస్థిరంగా ఉంటే మాత్రం భారత్‌లోకి వలసలు పోటెత్తే అవకాశం ఉంది. ఇది భారత అంతర్గత భద్రతను, సరిహద్దు సమస్యల్ని పెంచుతుంది. చొరబాట్లు, అక్రమరవాణా, ఉగ్రవాద ముప్పు పెరుగుతుంది. బంగ్లాదేశ్‌లో ఇలాంటి పరిస్థితులే ఉంటే, ఇది మొత్తం తూర్పు, ఈశాన్య భారతదేశాలకు, బంగాళాఖాతంలో భద్రతపై ప్రభావం చూపుతుంది. బంగ్లాదేశ్ పరిస్థితి ఒక ఉద్దేశపూర్వక కుట్ర ద్వారా దిగజారుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

మీ వైఫల్యాలకు మాదా బాధ్యత!

ప్రతిపక్షాన్ని నిందించడమే మోదీకి తెలుసు: ఖర్గే

కాల్బుర్గి: చేసిన తప్పులన్నింటికి బాధ్యత తీసుకోకుండా ప్రతిపక్షంపై నిందలు మోపడం ప్రధాని నరేంద్ర మోదీకి పరిపాటైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రాదేశిక భద్రత, గుర్తింపును పణంగా పెట్టి చొరబాటుదారులకు రక్షణ కల్పించారని, అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాలను విస్మరించారని ప్రధాని చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడం చేతకాక కాంగ్రెస్‌ను బీజేపీ నిందిస్తోందని అన్నారు. ఖర్గే ఆదివారం కాల్బుర్గిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంతో పాటు అసోం రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తమ పార్టీని నిందించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఫల్యాలకు బీజేపీ బాధ్యత తీసుకోదని, ప్రతిపక్షాలపై నెపం నెట్టివేస్తుందని దుయ్యబట్టారు. అసోం ప్రభుత్వాన్ని ‘దేశద్రోహి’ అన్నారు. కాంగ్రెస్‌ని నిందించడం కాదు మీ వైఫల్యాలకు బాధ్యత తీసుకోవడం నేర్చుకోండి అంటూ మోదీకి చురకలు అంటించారు. అసోంలో డబుల్ ఇంజిన్ సర్కారు పాలన సాగుతోంది. భద్రత కల్పించడంలో విఫలమైనది మీరు కాదా? మరి ప్రతిపక్షాలను ఎలా నిందిస్తారు? అని ఖర్గే ప్రశ్నించారు. విఫలమైన ప్రతీసారి ప్రతిపక్షంపై నిందలు మోసం పద్ధతి కాదని హితవు పలికారు. దేశ ప్రయోజనాలకే తమ పార్టీ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ఉగ్రవాదులు, చొరబాటుదారులు, విద్రోహ కార్యకలాపాలను ఎన్నడూ ప్రోత్సహించదని చెప్పారు. అదే సమయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో వీబీ జీ ఆర్ఏఎం జీ చట్టాన్ని తీసుకురావడాన్ని ఖర్గే ఖండించారు. గ్రామీణ పేదలపై ఈ మార్పు ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పార్లమెంటులో సమగ్రంగా చర్చలు జరపకుండా హడావిడిగా బిల్లులను ఆమోదించారని వీబీజీ ఆర్ఏఎం జీ, శాంతి బిల్లులనుద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. అణు శక్తి చట్టాన్ని శాంతి (సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్ మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్ ఫార్మింగ్ ఇండియా)తో భర్తీ చేయడాన్ని ఖండించారు. ఈ బిల్లు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని అన్నారు. శాంతి బిల్లుకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని, పార్లమెంటు లోపల, బయట కాంగ్రెస్ నిరసనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు.

అణు బిల్లుతో దేశ రక్షణ వ్యవస్థకు నష్టం

(మొదటిపేజీ తరువాయి)

వారిని రౌడీషీటర్లతో పోల్చడంలో పవన్ కల్యాణ్ రాజకీయ విజ్ఞత ఎంతో అర్థమవుతోందని నారాయణ అన్నారు. దీనిపై విమర్శ చేశానని తన పైన సోషల్ మీడియా ద్వారా ఆ పార్టీ వాళ్లు చేస్తున్న దాడులపై నారాయణ సమాధానమిస్తూ... మీ తాటాకు చప్పుళ్లకు బెదిరే వ్యక్తిని కాదని అన్నారు. రౌడీయిజం చేస్తున్న వ్యక్తులు అధికార పార్టీలో 50 శాతం ఉంటే, ప్రతిపక్ష పార్టీలో కూడా 50 శాతం ఉన్నారని విమర్శించారు. వీరిని అదుపు చేయడంలో విఫలమైన పాలకులు... పేదల పక్షాన పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులపై పరోక్షంగా దాడులకు దిగడం సరికాదని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల చుట్టూ తిరుపతిలో అలిపిరి వద్ద పింగాణీ బొచ్చెను పట్టుకొని యాత్రికులను యాచించే వారి మాదిరిగా తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తనకున్న ఎంపీల బలంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి నిధులు రాబట్టుకోవాలే తప్ప ఈ ప్రాధేయపడే పద్ధతులు చూస్తుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజల మనోభావాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అర్థమవుతోందని తెలిపారు. ఇప్పటికయినా సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రానికి అవసరమైన నిధులు తీసుకురావాలని కోరారు.

పీపీపీతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం : ఈశ్వరయ్య

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఫలితంగా రాష్ట్రంలో 2,500 మెడికల్ సీట్లను కార్పొరేటర్ శక్తులు వారి ఇష్టానుసారంగా అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. పీపీపీ వల్ల రెండు సంవత్సరాల నుంచి పని చేస్తున్న ప్రొఫెసర్లు, ఇతర ఉద్యోగులంతా రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్‌లో పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు అవకాశం లేకుండా పోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా వామపక్ష పార్టీల పోరాట పటిమతో సాధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం పేరు మార్చడంపై మండిపడ్డారు. 2014 లో కేంద్రంలో ఎన్డీయే అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ పథకానికి రాను రాను నిధులు తగ్గిస్తూ వచ్చిందని తెలిపారు. ఇప్పుడు ఈ పథకం నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై 40 శాతం నిధుల భారం మోపి... 60 శాతం తాము భరిస్తామని కేంద్రం చెప్పటాన్ని ఈశ్వరయ్య తీవ్రంగా తప్పుపట్టారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పెద్ద ఎత్తున సీపీఐ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, జిల్లా మాజీ కార్యదర్శి వి.రామరాజు పాల్గొన్నారు.

తీవ్ర పొగమంచు... 110 విమానాలు రద్దు

న్యూఢిల్లీ: దట్టమైన పొగమంచు కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆదివారం 110 విమాన సర్వీసులు రద్దవ్వగా, వందలాది సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు ఢిల్లీ విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీకి రాకపోకలు సాగించే 370 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి బయలుదేరే విమానాలు సగటున 26 నిమిషాలు ఆలస్యమవుతున్నట్లు అంచనా.

అణచివేత, అన్యాయం, దోపిడీని ప్రతిఘటిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

తొక్కారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలకు సవాల్ విసిరారు. జల్, జంగిల్, జమీన్‌ను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ర్యాలీ సందర్భంగా పాలకులపై తమ ఆగ్రహాన్ని, భవిష్యత్‌పై తమ ఆశలు-ఆకాంక్షలను రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేశారు. కాగా, ప్రజల పక్షాన అనేక పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో సీపీఐ 100 ఏళ్లు గడిపింది. భవిష్యత్తులోనూ ప్రజా హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తుందని సీపీఐ నాయకులు ఉద్ఘాటించారు. పార్టీకి గణనీయమైన సేవలు అందించిన సీనియర్లను ఈ సందర్భంగా సన్మానించారు.

16 ఎప్‌స్టీన్ ఫైళ్లు మాయం!

(మొదటిపేజీ తరువాయి)

16 ఫైళ్లు న్యాయశాఖ వెబ్‌పేజీ నుంచి ఎటువంటి వివరణ లేకుండా కనుమరుగయ్యాయని హౌస్ ఓవర్‌సైట్ కమిటీలోని డెమొక్రాట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. ‘ఎప్‌స్టీన్ ఫైళ్లలో డొనాల్డ్ ట్రంప్ ఫోటో ఉన్న 468 నంబరు ఫైలు న్యాయశాఖ విడుదల చేసిన తాజా ఫైళ్లలో లేదు. దీనిని ఉద్దేశపూర్వకంగా తొలగించారు’ అని డెమొక్రాట్లు ఆరోపించారు. ఇదే అంశమై అటార్నీ జనరల్‌ను ఓవర్‌సైట్ కమిటీ ప్రశ్నించింది. (అటార్నీ జనరల్ పామ్ బాండి) ఇది నిజమేనా? ఇంకా ఏయే విషయాలు దాచిపెట్టారు? అమెరికా ప్రజలకు, మాకు పారదర్శకత అవసరం’అని పేర్కొంది. న్యాయశాఖ తాజా ఫైళ్లలో ఫోటోలు, మెయిల్స్, ఆడియో రికార్డింగ్‌లు, అనేక సంవత్సరాల పరిశీలనలో సేకరించిన దర్యాప్తు సామగ్రి ఉన్నాయి. ఆన్‌లైన్‌లో పెట్టిన 24 గంటల్లోనే 16 ఫైళ్లు మాయమయ్యాయి. ఇందులో ట్రంప్, ఆయన భార్య మెలానియా, ఎప్‌స్టీన్, అతడి సన్నిహితులు గిస్లైన్ మాక్స్‌వెల్‌తో దిగిన ఫోటో ఉంది. అలాగే, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, వాణిజ్య శాఖ మాజీ మంత్రి ల్యారీ సమ్మర్స్, ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్, అమెరికాలో బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్, ఇజ్రాయిల్ మాజీ ప్రధాని ఎహుద్ బరాక్, న్యూ మెక్సికో గవర్నర్ బిల్ రిచర్డ్‌సన్, అమెరికా సెనేట్ నేత జార్జ్ మిచెల్, కుబేరులు ఎలాన్ మస్క్, బిల్ గేట్స్, రైడ్ హాఫ్‌మన్, పీటర్ థెయిల్ తదితరులున్నారు.

దక్షిణాఫ్రికాలో కాల్పులు... 9 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈనెల 6న ప్రిటోరియా సమీపంలో కూడా కాల్పులు చోటు చేసుకొన్నాయి. మూడేళ్ల చిన్నారితో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

ఉపాధికి తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

పది వామపక్ష పార్టీలు నిరసనలకు పిలుపునిచ్చాయి. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా అన్ని జిల్లాల్లోను ఆందోళనలు కొనసాగుతాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టానికి సవరణ చేసి, దానికి వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (వీబీ-జీ రామ్ జీ) పేరు మార్చింది. కేంద్ర కూటమిలో ఉన్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వం దీనిపై మౌనం దాల్చడం పైనా విమర్శలున్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం దేశ పార్లమెంటులో చరిత్రలోనే తొలిసారి జరగడం చర్చనీయాంశమయింది. గాంధీ పేరు తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను, ఆయన ఆశయాలను కేంద్ర ప్రభుత్వం అవమానించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టం ద్వారా ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలు, కష్టజీవులు, గ్రామీణ కార్మికులు, చేతివృత్తిదారులు ఉపాధి పొందుతున్నారు. ఇది వారికి చట్టబద్ధమైన హక్కుగా మారింది. కేంద్రం అలాంటి చట్టానికి పేరు మార్చి, నిధుల కోతల ద్వారా నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కష్టజీవులు, వ్యవసాయ కూలీలలో ఆందోళన నెలకొంది. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ పేదలను రోడ్డున పడేలా చేశారు. ఈ కొత్త పథకం గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఉపాధి పథకం కేంద్రం దయాదాక్షిణ్యాల పైనే నిర్వహించేలా మారింది.

ఉపాధి చట్టం వాటాలోనూ కోత

గతంలో (ఎంజీఎన్ఆర్ఈజీఏ) చట్టం కింద నిధుల వాటా కేంద్రానికి 90 శాతం, రాష్ట్రాలకు 10 శాతం ఉండగా, ప్రస్తుతం 60:40 గా మార్చడంతో కష్టజీవులకు కూలి పనులు ప్రశ్నార్థకంగా మారాయి. పని దినాలు 100 నుంచి 125 రోజులకు పెంచనున్నట్లు కేంద్రం చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్న వాదనలున్నాయి. ఉపాధి కార్డులను హేతుబద్దీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయించడం, ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించడంతో ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండే సమయాలలో 60 రోజుల ఉపాధిని నిలుపుదల చేయడం వలన అత్యంత అవసరమైన సమయాలలో గ్రామీణ కార్మికులకు పని దూరమవుతుంది. తద్వారా వారిని భూస్వాములపై ఆధారపడేలా చేస్తారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుంది. ఆకలి చావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం వల్ల మళ్లీ ఆకలి చావులు, వలసలు పెరిగే ప్రమాదం ఉంది. ఈ నిర్ణయం అమలయితే ఆంధ్ర ప్రదేశ్ వంటి ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. మొత్తంగా ఈ చట్టమే నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఒకవైపు కూటమి ఎంపీ ఎంపీ కృష్ణదేవరాయలు ఈ భారాన్ని రాష్ట్రం భరించలేదని చెబుతుంటే, మరోవైపు జనసేన ఎంపీ బాలశౌరి మాత్రం రాష్ట్రాలే భరించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించడంతో కూటమిలోనే గందరగోళం కనిపిస్తోంది. పైగా దీనికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను అనుసరించి కాకుండా రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారన్న విమర్శలున్నాయి. అటు వైసీపీ సైతం మౌనం దాల్చడంపై విమర్శలు ఉన్నాయి. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే... గతంలో కేంద్రమే అపరాధ రుసుము చెల్లించేది. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రాలపైనే నెట్టేశారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు చేస్తున్న వ్యాఖ్యలు గందరగోళంగా మారాయి.

ఆందోళనలు విజయవంతం చేయాలి : గుజ్జుల ఈశ్వరయ్య

కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఏను క్రమంగా నిర్వీర్యం చేస్తూ గ్రామీణ పేదలు, కష్టజీవుల ఉపాధిని దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలు విజయవంతం చేయాలని పది వామపక్ష పార్టీల తరపున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగింపు అని, ఇది జాతిపితను అవమానించడమేనని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మహాత్మా గాంధీ పేరునే కొనసాగించాలని, మోదీ ప్రభుత్వం చట్టాలు, పథకాల పేర్ల మార్పుపై పెట్టే శ్రద్ధ దేశ ప్రగతిపై పెట్టాలన్నారు. 125 రోజులకు పని దినాలను పెంచుతున్నామని చెబుతున్న మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు కుటుంబానికి సగటున 50 పని దినాలు కూడా కల్పించలేదని వివరించారు. పథకాల పేర్ల మార్పు వల్ల అనవసర ఖర్చు తప్ప ప్రయోజనం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉగాదికి 5లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

12.59 లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం అడుగులు వేస్తోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇప్పటికే పూర్తి చేసిన 3.00 లక్షల గృహాలతో పాటు వచ్చే ఉగాదికి 5.00 లక్షల గృహాలను, జూన్ కల్లా మరో 87 వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళుతోందని తెలిపారు.

పీఎంఏవై-1 పథకం అమలు గడువును కేంద్రం మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో ఈ పథకం కింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిసెంబరు అంతానికి పూర్తి చేయాల్సి ఉంది. ఐదేళ్ల కాలంలో దాదాపు 15.59 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉంది. అయితే వీటిలో పీఎంఏవై-1.0 కింద 8.87 గృహాలు, పీఎంఏవై-2.0 అర్బన్ లో 91 వేల గృహాలు, పీఎంఏవై గ్రామీణ్ కింద 5.81 లక్షల గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. వీటికి అదనంగా పీఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 3.47 లక్షల మంది ఆవాస్ యోజన యాప్ లో దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం 18.61 లక్షల గృహాలను మంజూరు చేసి, వాటిలో కేవలం 6.00 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయడం జరిగింది. అయితే ఇళ్ల స్థలాలు కావాల్సిన వారిని గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకు 81 వేల మందికి స్థలాలు అవసరమని గుర్తించారు. అదే విధంగా దాదాపు 1.15 లక్షల మంది ప్రభుత్వ పోరంబోకు స్థలాలలో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికేట్లను ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వీటిలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే వైసీపీ హయాంలో జగనన్న కాలనీల పేరిట ఇళ్లు మంజూరు చేశారు. కానీ ఊరికి దూరంగా.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చారు. దీంతో అక్కడ ఇళ్లు నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. అందుకే గత ప్రభుత్వ హయాంలో లక్షలాది ఇళ్ల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. అయితే కొత్తగా మంజూరు చేయాలంటే ఉన్న వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై పడింది. కాగా హౌస్ ఫర్ ఆల్ స్కీం కింద పేదలందరికీ, అర్హులకు ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిపి దరఖాస్తులను స్వీకరించింది. పది లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. అయితే ప్రాధాన్యత క్రమంలో ఫిబ్రవరి నుంచి ఈ ఇళ్ల మంజూరు ప్రక్రియ ఉండనుంది. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఆ దిశగా ఆచరణపై తీవ్రమైన తాత్సారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో స్థలాలు పొంది... వారు అక్కడ ఇళ్లు కట్టడానికి ఇష్టపడకపోతే వాటిని రద్దుచేసి నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తారు. ఉన్న స్థలంలోని ఇల్లు కట్టుకుంటామంటే అనుమతిస్తారు. కొత్తగా స్థలం కొనేవారికి, ధరలు ఎక్కువగా ఉన్నచోట జి 03 అంటే నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తారు. ఐదేళ్లలో అర్హులైన ప్రతి పేదవాడికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వడమే ధ్యేయమని కూటమి నాయకులు చెబుతున్నారు.

‘వీబీజీ రామ్‌జీ’కి రాష్ట్రపతి ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకొచ్చింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించినా, నిరసనలు చేపట్టినాగానీ ప్రభుత్వం ఏకపక్షంగా ఈ బిల్లును ఆమోదించింది. ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదంతో వీబీ-జీ ఆర్ఏఎం జీ చట్ట రూపం దాల్చింది. హడావుడిగా బిల్లు ఆమోదించారని, ఇది అప్రజాస్వామికమని విపక్షాలు అభ్యంతరం తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దు సరికాదన్నారు. పార్లమెంటు లోపల, బయట ఆందోళనలు నిర్వహించారు. లోక్‌సభలో పోడియం వద్దకు వెళ్లి బిల్లు ప్రతుల్ని చించిపారేశారు. అయినాగానీ కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్లింది. కొత్త బిల్లును సమర్థించుకున్నది. రూ.10-11 లక్షల కోట్లను కూలీ కోసం ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారు చేశామని కేంద్రమంత్రి చౌహాన్ వివరణ ఇచ్చారు. కాగా, గతంలో ఉపాధి హామీకి సంబంధించి కేంద్రమే నిధులు సమకూర్చేది కానీ ఇప్పుడు 60:40 చొప్పున కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకోవాల్సి ఉంటుంది. నీటి భద్రత, కీలక గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి సంబంధిత ఆస్తులు, వాతావరణం వంటి నాలుగు అంశాలు ఆధారంగా ఉపాధిని నిర్ణయించేలా కొత్త చట్టం ఉన్నది. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా నూతన చట్టమున్నట్లు సర్కారు చెప్పుకుంటోంది. ఇదిలావుంటే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు అనేక మంది ప్రతిపక్ష నాయకులు మహాత్మా గాంధీ పేరు తొలగింపుతో పాటు ఉపాధి హక్కును నీరుగార్చడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. దీనిని రద్దు చేసేంత వరకు పోరాడతామని తేల్చిచెప్పారు.

ఈడురాని అమ్మాయిలపై అఘాయిత్య తబ్సీళ్లు

(మొదటిపేజీ తరువాయి)

లైంగిక దాడికి గురైన వారిలో ఇప్పుడు కొందరు తల్లులయ్యారు. కొందరు పెళ్లిళ్లు చేసుకున్నారు. కొందరు నర్సులుగా, బార్ టెండర్లుగా, స్థిరాస్తి వ్యాపారులుగా, కేశాలంకార నిపుణులుగా, ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. అందులో ఒకరు హాలీవుడ్ నటిగా ఉన్నారు.

ఈ పీడనకు గురైన వారిలో చాలా మంది భయం గుప్పిట్లో ఉండిపోయారు. కొందరు మానసికంగా కుంగి పోయారు. కొందరు జైలు శిక్షలు కూడా అనుభవించారు. మియామీ హెరాల్డ్ కోర్టు పత్రాలను, కోర్టు కేసులను, సాక్ష్యం చెప్పిన వారిని, ఇటీవలే విడుదలైన ఎఫ్.బి.ఐ. పత్రాలను పరిశీలించి ఈ కథనాలు రాసింది.

ఎపిస్టీన్ ను 2008లో అరెస్టు చేశారు. 2009లో విడుదలయ్యాడు. 2019 జులైలో ఆయనకు ఈడు రాని అమ్మాయిలను లైంగికంగా వేధించినందుకు జైలు శిక్ష పడింది. నెల రోజుల తరవాత ఆయన ఆత్మ హత్య చేసుకున్నాడంటున్నారు. అయితే ఇది ఆత్మ హత్యా లేక హత్యకు గురయ్యాడా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

అలెగ్జాండర్ అకోస్టా అనే అమెరికా మంత్రి ఎపిస్టీన్ తో లోపాయికారీ ఒప్పందం కుదురుచుకుని ఆయనను కాపాడే ప్రయత్నం చేశారంటున్నారు. అది నిజమో కాదోగానీ తరవాత అకోస్టా రాజీనామా చేశారు. 2010లో ఎపిస్టీన్ పై అనేక మంది మహిళలు కేసులు దాఖలు చేశారు. సంపద ఉన్న వాడు కనక సునాయాసంగా బయట పడ్డాడు. 2015లో ఆయన మీద మరో కేసు దాఖలైంది.

ట్రంప్ కు ఎలాన్ మస్క్ కు మధ్య స్పర్థలు చెలరేగినప్పుడు ఎపిస్టీన్ ఫైల్స్ ను బయట పెడ్తానని మస్క్ బెదిరించిన అంశం గుర్తుండే ఉంటుంది.

ఎపిస్టీన్ ఫైల్స్ కు సంబంధం లేకపోయినా మన దేశంలో అమ్మాయిలు మాయమై పోవడాన్ని గురించి తెలుసుకోవాల్సి ఉంది. 2023 జనవరి నుంచి జనవరి 2025 మధ్యలో మధ్య ప్రదేశ్ లో 23 వేల మంది అమ్మాయిలు, మహిళలు కనిపించకుండా పోయారు. మధ్యప్రదేశ్ లో ప్రతి రెండు గంటలకు ముగ్గురు మహిళలు ఆచూకీ లేకుండా పోతున్నారు. అంటే సగటున 43 మంది మహిళలు పత్తా లేకుండా పోతున్నారు. 2019 2021 మధ్య 13,078 మంది మహిళలు ఆచూకీ లేకుండా పోయారు. మొత్తం మీద మూడేళ్లలో 13 లక్షల మంది అమ్మాయిలు మాయమయ్యారు.

ఈ సందర్భంగానే తాజాగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డా. మోహన్ యాదవ్ జారీ చేసిన ఆదేశాన్ని గమనించాలి. అసత్య ప్రచారం చేసే యూట్యూబర్లపై కఠిన చర్య తీసుకోవాలని ఆయన పోలీసు డైరెక్టర్ జనరల్ ను ఆదేశించారు. అసత్య ప్రచారం చేసే యూట్యూబర్ల మీద చర్య తీసుకోవడం సబబే కావొచ్చు. కానీ నిత్యం అబద్ధాలాడే బడా నాయకులపై ఏం చర్య తీసుకుంటున్నాయి?

చచ్చినా సత్యం గోదీ మీడియా ద్వారా బయటకు పొక్కదు. సత్యాన్ని బయట పెట్టేది యూట్యూబర్లే. అసత్య ప్రచారం చేస్తే ప్రభుత్వాలు ఖండన ఇవ్వొచ్చు. తమ వాదన చెప్పొచ్చు. ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలు చేయడం, తీవ్ర చర్యలు తీసుకోవడం విచిత్రమే.

పదవులు పొందిన జనసేన నేతలతో నేడు పవన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పక్షాన నామినేటెడ్ పదవులు పొందిన వారితో పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం సమావేశం అవుతున్నారని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. మూడు వేల మందితో పదవి - బాధ్యత అని పేరిట నిర్వహించే ఈ సమావేశం ద్వారా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారికి దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమం గురించి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులతో ఆదివారం ఉదయం నాదెండ్ల మనోహర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "పార్టీ తరఫున సోమవారం నిర్వహిస్తున్న "పదవి- బాధ్యత" కార్యక్రమం చాలా కీలకమైన సమావేశం. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ గారు ఇవ్వబోయే ప్రసంగం మనందరికీ మార్గ దర్శకంగా ఉండబోతుంది" అన్నారు.

పీఏసీఎస్, డీసీసీబీలకు తక్షణమే ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 1,895 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)కు, 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లకు వెంటనే ఎన్నికలు జరిపేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో 1,895 పీఏసీఎస్‌లు, 13 డీసీసీబీలు ఉన్నాయని వివరించారు. వాటికి ప్రతి ఐదేళ్లకోసారి ప్రత్యక్ష ఎన్నికలు జరపాల్సి ఉందన్నారు. 2013లో జరిగిన ఎన్నికల కాలపరిమితి 2018 పూర్తయినప్పటికీ...సహకార సంఘాలు ఎన్నికల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆరు నెలల గడువుతో నామినేటెడ్ పాలకమండలి కమిటీలు నియమించి, ప్రతి ఆరు నెలలకూ వాటి కాలపరిమితిని పొడిగిస్తూ వస్తున్నారని వివరించారు. పాలకవర్గాలు లేకపోవడం, నామినేటెడ్ కమిటీల కాలపరిమితి ప్రతి ఆరు నెలలకు పొడిగిస్తుండడంతో సొసైటీల పనితీరు నత్తనడకగా మారిందన్నారు. చట్టపరిధికి లోబడి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికయిన పాలకవర్గాల అధ్వర్యంలో పారదర్శకంగా జరగాల్సిన సహకార సంఘాల నిర్వహణ, రైతు సంక్షేమం దిశగా సాగాల్సిన కార్యక్రమాలు అధికారులు, ఉద్యోగుల నియంత్రణలోకి వెళ్లిపోయాయని తెలిపారు. వారి

ఇష్టానుసారంగా సహకార వ్యవస్థ తయారైందన్నారు. పాలకవర్గాలతో సంబంధం లేకుండా ఉద్యోగస్తుల నియామకం జరిగిపోతున్నదని పేర్కొన్నారు. నామినేటెడ్ పాలకవర్గాలు పాలసీ విధానాల జోలికి పోకుండా, రోజువారీ వ్యవహారాలు మాత్రమే చేపట్టాలనే నిబంధన ఉల్లంఘిస్తూ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంతో సహకార వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సహకార సంఘాల ఎన్నికలు జరగకపోవడం వల్ల, పాలక మండలిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల భాగస్వామ్యం లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టం 1964 సెక్షన్ 31 రూల్స్ 22 ప్రకారం సహకార సంఘాల పాలకవర్గాలకు సకాలంలో ఎన్నికలు జరిగితే, ఒక్కో పీఏసీఎస్‌లో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, ఇద్దరేసి బీసీ అభ్యర్థులు పాలకవర్గ సభ్యులుగా ఎన్నికవుతారన్నారు. ఒక్కో డీసీసీబీకి నలుగురు ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్లు, ఇద్దరు బీసీ డైరెక్టర్లు ఎన్నికవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సహకార డేటాబేస్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలలో ఉన్న 1,895 సొసైటీల్లో 9,475 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు, 13 డీసీసీబీలలో 78 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు పదవులు పొంది, సహకార రంగంలో భాగస్వాములవుతారన్నారు. పీఏసీఎస్‌లకు, డీసీసీబీలకు ఎన్నికలు జరపకుండా నామినేషన్ ద్వారా పదవులు భర్తీ చేయడం వల్ల సుమారు 10 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సహకార వ్యవస్థలో చట్టప్రకారం రావలసిన డైరెక్టర్ పదవులు కోల్పోయారని తెలిపారు. పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్ పోస్టులకు, ఆప్కాబ్ (రాష్ట్ర సహకార బ్యాంకు) డైరెక్టర్ పోస్టులకు ఎస్సీ,ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వర్తింపచేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

'ఉపాధి' సాధనకు కూలీలు ఉద్యమించాలి

గాంధీ పేరు తొలగింపు మోదీ మతోన్మాదానికి పరాకాష్ట: కోటేశ్వరరావు

విశాలాంధ్ర -విజయవాడ: దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నియంతృత్వ చెరలో ఉందని, దీని సాధనకు దేశవ్యాప్తంగా వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో ఉవ్వెత్తున సాగుతున్న పోరాటంలో కూలీలంతా మమేకమై ఉధృతంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న నిరసన ఉద్యమంలో భాగంగా ఆదివారం తాడేపల్లిలో ఉపాధి కూలీలతో జరిగిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోటేశ్వరరావు హాజరయ్యారు. పలుగు, పార, కర్ర, కత్తి, గొడ్డలి, గమేళాలు చేతబట్టి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ... ఉపాధి హామీ నుంచి గాంధీ పేరు తొలగించి రామనామం స్మరించే విధంగా నామకరణం చేయడం మోదీ ప్రభుత్వ మతోన్మాద చర్యలకు పరాకాష్టని విమర్శించారు. ఇది రాజ్యాంగం విరుద్ధమని అన్నారు. నిరుపేదల ఆహార భద్రతకు రక్షణ కవచంగా ఉన్న ఈ పథకానికి పాతర వేసేందుకు పార్లమెంటులో ఆమోదింప చేసుకోవడం క్రూరమైన చర్య అని దుయ్యబట్టారు. 20 ఏళ్లుగా గ్రామీణ కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ పథకాన్ని సమాధి చేసే కుట్రలు తీవ్రతరం అవుతున్నాయన్నారు. గ్రామీణ పేదలంతా ఒక్కటై పోరాటాలకు సంసిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. చేబ్రోలు రాంబాబు, భూక్య దేశీయ బానోతు, శివ నాయక్ విజయ్, తుపాకుల రాయప్ప, అమెరియా, ఇండ్ల పుల్లారావు, ఇస్లావత్ బాలాజీ , రావూరి తీర్పి, బాణావతి కుమారి, ఇస్లావత్ హున దుర్గ, గంగమ్మ, మహంకాళి పాల్గొన్నారు.

సీపీఐ శతవసంతోత్సవాలు ఘనంగా నిర్వహించండి

వందేళ్ల చరిత్రను ప్రజలకు వివరించండి: అక్కినేని వనజ

విశాలాంధ్ర - ఏలూరు: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26 వరకు సీపీఐ శతవసంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం జూమ్‌లో జరిగింది. ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వనజ మాట్లాడుతూ... శతవార్షికోత్సవాల సందర్భంగా గ్రామ, మండల, పట్టణ స్థాయిలలో సీపీఐ పతాకాలను ఆవిష్కరించి, పార్టీ వందేళ్ల చరిత్రను ప్రజలకు వివరించాలని సూచించారు. శత వసంతాల ముగింపు సభ తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో 2026, జనవరి 18న ముగింపు మహాసభ జరుగుతుందని, ఐదు లక్షల మంది హాజరయ్యే ఆ సభకు ఏలూరు జిల్లా నుంచి మూడువేల మందికి తగ్గకుండా కార్యకర్తలు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వాన్ని, శత వార్షికోత్సవ నిధిని జనవరి 31 నాటికి జిల్లా కేంద్రానికి అందజేయాలని కోరారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ జిల్లాలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ శ్రేణులు సీపీఐ శత వార్షికోత్సవాలను వాడవాడల ఘనంగా నిర్వహించాలని, పార్టీలో పనిచేసి మరణించిన వారికి జోహార్లు అర్పిస్తూ వారి త్యాగాలను నేటి తరానికి తెలియపరిచే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సీపీఐ నేత బండి వెంకటేశ్వరరావు, ఎండి మున్సీర్, కారం ధారయ్య, ఉప్పులూరి హేమ శంకర్, బాడిస రాము, నిమ్మగడ్డ నరసింహ, జేవీ రమణ రాజు, తొర్లపాటి బాబు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, వర్క శ్యామల, టీవీఎస్ రాజు, రాయంకుల లక్ష్మణరావు, గోలిమే బాలయేసు, భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడారు. పిట్టా ప్రసాద్, పుప్పాల కన్నబాబు, కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

అధికారికంగా ప్రకటించిన పార్టీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ (జిల్లా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల జాబితాను ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. ఈ మేరకు జాబితాను ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. వివిధ సామాజిక సమీకరణాలు, నాయకత్వ సామర్థ్యం, సీనియారిటీ, విధేయత, అనుభవం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు వారిని ఎంపిక చేశారు. పార్లమెంట్ జిల్లాల వారీగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివరాలు ఇలా... అనకాపల్లి జిల్లాకు బత్తుల తాతయ్య బాబు, కాశినాయుడు, అరకు (ఎస్టీ)కి మోజోరు తేజోవతి, దత్తి లక్ష్మణరావు, శ్రీకాకుళంకు మోదవలస రమేశ్, పీరికట్ల విఠల్ రావు, విశాఖపట్నంకు చోడే వెంకట పట్టాభిరాం, తోలగల కృష్ణ, విజయనగరంకు కిమిడి నాగార్జున, ప్రసాదుల వరప్రసాద్, అమలాపురంకు గుత్తల సాయి, పాలం రాజు, ఏలూరుకు బడేటి రాధాకృష్ణ, ముత్తారెడ్డి జగ్గవరపు, కాకినాడకు జ్యోతుల నవీన్, పింకే శ్రీనివాస్ బాబా, నర్సాపురంకు మంతెన రామరాజు, పితాని మోహన్‌రావు, రాజమండ్రికి బొడ్డు వెంకట రమణ చౌదరి, కాసి నవీన్, బాపట్లకు నలగల రాజశేఖర బాబు, నక్కల రాఘవ, గుంటూరుకు పిల్లి మాణిక్యరావు, పోతినేని శ్రీనివాసరావు, మచిలీపట్నంకు వీరంకి గురుమూర్తి, గోపు సత్యనారాయణ, నర్సరావుపేటకు షేక్ జానే సైదా, నల్లపాటి రామచంద్ర ప్రసాద్, విజయవాడకు గద్దె అనురాధ, చెన్నుబోయిన చిట్టిబాబు, చిత్తూరుకు షణ్ముగ రెడ్డి,వై సునీల్ కుమార్ చౌదరి, నెల్లూరుకు బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఒంగోలుకు ఉగ్ర నర్సింహరెడ్డి, కొఠారు నాగేశ్వరావు, రాజంపేటకు సుగవాసి ప్రసాద్ బాబు, పఠాన్ ఖాదర్ ఖాన్, తిరుపతికి పనబాక లక్ష్మి, డాలర్ దివాకర్ రెడ్డి, అనంతపురంకు పూల నాగరాజు, జి శ్రీధర్ చౌదరి, హిందూపూర్‌కు ఎంఎస్ రాజు, హనుమప్ప, కడపకు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, వై.ఎస్ జబీవుల్లా, కర్నూలుకు గుడిశె కృష్ణమ్మ, పూల నాగరాజు యాదవ్, నంద్యాల జిల్లాకు గౌరు చరితారెడ్డి, ఎన్.ఎం.డి. ఫిరోజ్ నియమితులయ్యారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత

విద్యాసాగర్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం ... సమాన పనికి సమాన వేతనం చెల్లించడం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సంఘటిత కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసాగర్ మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వమే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 151 జీవో ద్వారా 50 శాతం జీతం పెంచిందని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఒకటో తేదీనే జీతాలు వచ్చే ఏర్పాటు చేసింది ఏపీ ఎన్జీవో కృషి వల్లనే అని తెలిపారు. వీరికి ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఆప్కాస్‌ను యథాతథంగా ఉంచాలని కోరారు. వెయిటేజ్ ఇవ్వాలన్నారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. త్వరలో సంబంధిత అధికారులను, మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని విద్యాసాగర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాణ్యం వేణు, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు మాట్లాడుతూ మెప్మా సెర్ప్ ఉద్యోగుల మాదిరి గా హెచ్ఆర్ పాలసీని అన్ని ప్రభుత్వ శాఖలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలని కోరారు. ప్రతి ఏడాది 10 శాతం జీతం పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి 20 డిమాండ్లపై తీర్మానం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కోశాధికారి పి.బి. బాలసుబ్రమణ్యం, కృష్ణాజిల్లా అధ్యక్షుడు సత్యవాడ సంతోష్ కుమార్, సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు బి. చంద్రశేఖర్ రెడ్డి, కమర్షియల్ టాక్సెస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకటేష్ బాబు, ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షుడు వేమూరి వెంకటేశ్వర ప్రసాద్, విజయవాడ నగర అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న మోదీ సర్కార్

కమ్యూనిస్టులపై విష్ణుకుమార్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

జంగాల అజయ్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు మితిమీరిపోతున్నాయని, ప్రజలను మరింత అంధకారంలోకి నెట్టివేసే విధంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ పేదలు, కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తోందని అన్నారు. గుంటూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి లేకుండా పోయిందని విమర్శించారు. కార్మికులు, రైతులు తీవ్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలను అజయ్ కుమార్ ఖండించారు. కమ్యూనిస్టులే కార్మికులకు శాపమని అనడం అవివేకమని అన్నారు. ఈ దేశంలో కార్మిక వర్గం హక్కులను సాధించుకున్నది కమ్యూనిస్టు ఉద్యమం వల్లేనని స్పష్టం చేశారు. ఎనిమిది గంటల పని దినం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి మౌలిక హక్కులు కమ్యూనిస్టుల పోరాటాల ఫలితమని గుర్తు చేశారు. కమ్యూనిస్టులపై ఈ విధమైన ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందని, నిధులు తగ్గిస్తూ పేదల ఉపాధిని ప్రమాదంలోకి నెడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల విషయంలో పీపీపీ విధానాన్ని అనుసరిస్తూ ప్రైవేటీకరణ దిశగా నడిపించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వైద్య విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను వామపక్షాలు సహించవని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు రైతులకు అది చేస్తా ఇది చేస్తా అని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాక రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేదల ఉపాధిని దెబ్బతీయడానికి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరకంగా సోమవారం గుంటూరులోని లాలాపేట గాంధీ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టానికి పేరు మార్చి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఆర్ఎంజీ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సూచన మేరకే ఆనాటి యూపీఏ-1 ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే విధంగా ఎంజీఎన్ఆర్ఈజీఏ తీసుకొచ్చి చట్టం చేసిందని గుర్తు చేశారు. జీఆర్ఎంజీ కి వ్యతిరేకంగా 22వ తేదీన జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీల అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మార్చి 10,11,12 తేదీలలో రాజమండ్రిలో

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు వెల్లడి

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్

విశాలాంధ్ర-రాజమండ్రి: ఆంధ్ర ప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 6వ మహాసభలు చారిత్రక రాజమండ్రి నగరంలో మార్చి 10,11,12 తేదీలలో జరుగుతాయని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బారాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. పార్లమెంటులో చట్టాలపై చర్చలు జరిపి ఆమోదింప చేసుకోవాల్సిన సాంప్రదాయక పద్ధతికి తిలోదకాలు ఇచ్చి ప్రధాని మోదీ నేరుగా క్యాబినెట్‌లో ఆమోదం తెలుపుకొని దేశ కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టేశారని మండిపడ్డారు. ఎనిమిది గంటల పని హక్కును హరించి 10 నుంచి 12 గంటల వరకు పెంచుకునే వెసులుబాటును ఆయా యాజమాన్యాలకు కల్పించడం ద్వారా శ్రమ దోపిడీకి తెరలేపారని అన్నారు. ఏదయినా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ఏడు మంది సభ్యులతో యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు ఉండేదని, నేడు ఆయా సంస్థల్లో సగానికి పైగా సభ్యులు ఉంటేనే యూనియన్ ఏర్పాటుకు నూతన చట్టం అర్థం తెచ్చిందని ధ్వజమెత్తారు. కార్మికులు తమ సమస్యలు, హక్కుల పరిష్కారం కోసం 14 రోజుల గడువుతో సమ్మె చేసుకునే హక్కు ఉండేదని, దానిని వంద రోజులకు గడువు పొడిగించారని తెలిపారు. ఫలితంగా యాజమాన్యాలు కార్మికులను లోబర్చుకోవడం, భయభ్రాంతులకు గురి చేయడం, పనుల్లోంచి తొలగించడం వంటి చర్యలకు పాల్పడి కార్మికులు సంఘటితం కాకుండా సమ్మె హక్కును హరింపజేశారని విమర్శించారు. కార్మికుడు పదవీ విరమణ చేసిన సంవత్సరం తర్వాత గ్రాట్యూటీ ఇచ్చేలా ఈ నల్ల చట్టాన్ని రూపొందించారని అన్నారు. కేంద్రం ఎనిమిది సంవత్సరాలుగా లేబర్ కాన్ఫరెన్స్ సాంప్రదాయాన్ని కొనసాగించడం లేదని చెప్పారు. అంతర్జాతీయ కార్మిక ఒప్పందాలను ఖాతరు చేయకుండా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుగుణమైనటువంటి చట్టాల్లో భాగంగానే రాత్రిపూట పని వేళల్లో మహిళా కార్మికులు, ఉద్యోగులు నిర్బంధంగా పని చేసేలా చట్టం తీసుకువచ్చారని, ఇది శ్రామిక మహిళల హక్కులను కాలరాయడమేనని సుబ్బారాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకపోగా బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ముందుగానే రాష్ట్ర క్యాబినెట్‌లో 10 నుంచి 12 గంటల పని విధానానికి ఆమోదం తెలపడం కార్మికులకు ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఉసురు తగిలి కుప్పకూలుతాయని హెచ్చరించారు. తాటిపాక మధు మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆప్కస్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని, 60 సంవత్సరాల నిండిన కార్మికులను తొలగిస్తే... వారికి పదవీ విరమణ ప్రయోజనాలను, పెన్షన్ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారి వారసత్వంగా కుటుంబీకులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగునంగా సిబ్బందిని పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా నాయకులు కె.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల దుర్గమ్మ, జిల్లా అధ్యక్షులు రెడ్డి రమణ, కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, సామర్లకోట మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బొత్స శీను, కశింకోటి కిషోర్, ముమ్మిడివరం యూనియన్ నాయకులు శీలం వెంకటేష్, పిఠాపురం యూనియన్ నాయకులు సాకారామకృష్ణ, కాకినాడ యూనియన్ నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, తుపాకుల లక్ష్మీనారాయణ, రామచంద్రపురం యూనియన్ నాయకులు అమలు దాస్ మాచరయ్య, కొవ్వూరు మునిసిపాలిటీ నాయకులు సత్య కుమార్, కాకి శారద, బంగారు గిరిబాబు, వీరబాబు, ఆనందరావు పాల్గొన్నారు.

'ఏపీ బిల్డింగ్ రూల్స్'కు సవరణలు

స్వాగతించిన క్రెడాయ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్-2017కు కీలక సవరణలు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మంత్రి పి. నారాయణలకు క్రెడాయ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్ అసోసియేషన్) ఆంధ్రప్రదేశ్ విభాగం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా క్రెడాయ్ ప్రతినిధులు బుద్దిగ శ్రీనివాసు, బయాన శ్రీనివాస రావు తదితరులు మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాభివృద్ధి శాఖ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరేట్, ఫైర్ సర్వీసెస్ శాఖతో పాటు ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో నిరంతర సంప్రదింపులు, ప్రాతినిధ్యాల ద్వారా ఈ సవరణలు సాధ్యమయ్యాయని తెలిపారు.సవరించిన నిబంధనలు జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు, డెవలపర్లకు, అనుమతులు జారీ చేసే అధికారులకు స్పష్టమైన నియంత్రణ నిశ్చయతను కల్పిస్తాయని క్రెడాయ్ పేర్కొంది. కొత్త విధానంలో 24 మీటర్ల ఎత్తు వరకు ప్రారంభ అనుమతులు ఇవ్వడంతో పాటు, ఫైర్ ఎన్‌ఓసీ సమర్పణ ఆధారంగా తదుపరి అనుమతులు పొందేలా ఆచరణాత్మక వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. అలాగే, నిర్మాణ రూపకల్పన, భద్రతా ధృవీకరణలు ప్రారంభ దశ నుంచే మొత్తం ప్రతిపాదిత ఎత్తును కవర్ చేసేలా నిబంధనలు రూపొందించారని తెలిపారు. స్థిరమైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే దిశగా ఐజీబీసీ రేటింగ్ పొందిన సిల్వర్, గోల్డ్, ప్లాటినం ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులకు వరుసగా 10శాతం, 15 శాతం, 20 శాతం ఇంపాక్ట్ ఫీజు తగ్గింపులు కల్పించినట్లు వెల్లడించారు. అయితే, డెవలపర్లు చేసిన కట్టుబాట్లను గౌరవించని పక్షంలో ఈ ప్రోత్సాహకాలను ఉపసంహరించుకోవడంతో పాటు జరిమానాలు విధించే నిబంధనలను కూడా ఉత్తర్వుల్లో పొందుపరిచినట్లు క్రెడాయ్ స్పష్టం చేసింది.

మత్స్యకారుల వలసలు నివారించండి: సూరాడ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): సముద్ర తీరప్రాంత మత్స్యకారుల జీవన స్థితిగతులు దుర్భరంగా ఉండడంతో అనేక మంది వలస వెళ్తున్నారని, వలసల నివారణకు వేటకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు తక్షణం కల్పించాలని రాష్ట్ర మత్స్యకార సముదాయ సంఘాల నెట్ వర్క్ (ఫిష్ కాస్)అధ్యక్షుడు సూరాడ రాజారావు డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫిషింగ్ హార్బర్లు నేటికీ నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. ఫిష్ లాండింగ్ కేంద్రాల్లో మౌలిక మౌలిక సదుపాయాలతో పాటు మినీ ఫిషింగ్ జెట్టీల నిర్మాణం, వేటకవసరమైన ఆధునిక పరికరాలు, చేపల నిల్వకోసం కోల్డ్ స్టోరేజీలు ... విద్యుత్ ఉచితంగా ఇవ్వాలన్నారు. తీరప్రాంతలో ప్రభుత్వ భూములు ఆయా మత్స్యకారులకు కేటాయించి చేపలు, రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహిం చాలన్నారు. మత్స్యకార భరోసా కేంద్రాల్ని ఏర్పాటు చేసి మత్స్య సామాగ్రిలు సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ప్రతి 50 కిలోమీటర్ల పరిధిలో మినీఫిషింగ్ జెట్టీలు నిర్మించాలన్నారు. వలస మత్స్యకారులకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సాంప్రదాయ సముద్ర తీరప్రాంత మత్స్యకారుల హక్కుల రక్షణ చట్టం, 2009 డ్రాఫ్ట్-2 చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు, దళితులకు రిజర్వేషన్ ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. సముద్ర వేట నిషేధ సమయంలో రూ.40 వేల జీవనభృతి కింద చెల్లించాలన్నారు. సముద్రంలో ప్రామాదవశాత్తు మరిణిస్తే రూ.కోటి పరిహారం అందేలా ప్రభుత్వమే బీమా చేయించాలన్నారు. తీరప్రాంతంలో పరిశ్రమలు పెట్టరాదని, మత్స్య ఆధారిత పరిశ్రమల్లో మత్స్యకారులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి, సముద్ర కోతకు గురవుతున్న తీరప్రాంత వాసుల కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. హెల్త్ చెక్ అప్ నిర్వహించి మందులు ఇవ్వాలని, ప్రతి బోటుకు మెడికల్ కిట్ అందజేయాలన్నారు. ఆర్జిల్లి దాసు, పీత నాగబాబు, భక్తాని శ్రీనివాసులు, ప్రళయకావేరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సాహితి

అక్షరం అభ్యుదయానికి చేదోడు కావాలి!

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
సెల్: 9948774243

అహర్నిశలు సమాజాన్ని వివేచిస్తూ, అన్ని కోణాల నుంచీ అధ్యయనం చేసే అక్షరం కావాలిప్పుడు. సమాజంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఆర్థిక వ్యవస్థను, సాంఘీకశక్తుల విధ్వంసక చర్యలను, ప్రపంచీకరణ వికృత చర్యలను పసిగట్టే సాహిత్యం వెలుగు చూడా లిప్పుడు. దోపిడీకి గురిఅవుతున్న శ్రమజీవులను చైతన్య పరిచి, దోపిడీని ప్రశ్నించి, తిరుగుబాటు బావుటా ఎగరేసే భావుకతకు బాసటగా నిలిచే సాహితీవేత్తల సంఘటిత శక్తి కావాలిప్పుడు. సంస్కారశీలమైన వికాసం విజృంభించా లిప్పుడు. అక్షరం సామాజిక అభ్యుదయానికి చేదోడు కావాలి! నూతన సంవత్సరం వస్తుందంటే, గత సంవత్సరంలో కుంటుతూ, కునారిలుతూ, పేలవంగా నిలచిపోయిన అభివృద్ధిని కూలంకషంగా చర్చిస్తూ, గతం తప్పిదం తిరిగి జరగకుండా ఉండే యత్నానికి సత్తువ నిచ్చే సూచనలకు శ్రీకారం చుట్టే సాహిత్య అవసరాన్ని ఆహ్వానించాల్సి ఉంది. మార్క్సిస్టు భావజాలాన్ని పుణికి పుచ్చుకునే అభ్యుదయ భావజాలాన్ని అవలంబించినప్పుడే అట్టడుగు వర్గాల అభ్యున్నతి మూడు పూలు ఆరు కాయలై వికసిస్తుంటుంది. ఈ భావం సాహితీవేత్తల్లో వ్రేళ్లూను కున్నట్లే రాజకీయా ల్లోను, పాలకుల్లోను పొడగట్టాలి.

సామాజిక వికాసానికి, పురోగతి అభ్యుదయ సాహిత్యాన్ని ఒక అమూల్యమైన, అనర్ఘమైన సాధనంగా స్వీకరించాలి. నేడు సమాజంలో రాజకీయనాయకులు అభ్యుదయం పాట పాడుతూనే ఆచరణలో కార్పొరేట్ వ్యవస్థల ఏర్పాటుకు కొమ్ముకాస్తూ, వ్యవస్థాగతమైన అభివృద్ధికి తూట్లు పొడుస్తూ, వ్యక్తిగతాభివృద్ధికి దోహదపడడం చూస్తూనే ఉన్నాం.

కుల, మత సంకుచిత్వాల్లో కూరుకుపోయిన ఆధ్యాత్మిక సాహితీవేత్తల ఆలోచనా విధానాల్ని దుయ్యబడుతూ అభ్యుదయ సాహిత్యం, సార్వజనీనత, సార్వకాలీనమైన భావుకతతో ముందుకు సాగుతుంటోంది. సంఘంలోని అసమానతలు, పీడన, దోపిడీ, ఆకలి, పస్తులు, వస్తువుగా అభ్యుదయ సాహిత్యం సాగుతుంటూంది. వాటి పుట్టుకనే కాదు వాటిని పరిహరించే సూచనలు చేస్తుంటూంది. ఈనాడు చాలామంది అభ్యుదయ సాహిత్యాన్ని రాస్తూనే, ఆత్మవంచన చేసుకుంటూ, ఆర్థిక ప్రలోభాలకు లోనై ఫక్కా రాజకీయ వ్యాపారుల చంకల్లో దూరి వారి అడుగులకు మడుగులొత్తుతూ, అతిగతిలేని నిరుపేదల కష్టాలు కన్నీళ్లు పూర్వజన్మ కర్మలుగాను, చేసుకున్న పాపంగాను నమ్మించే నయ వంచనా ఆధ్యాత్మిక సూక్తులను రాస్తుంటారు. కనికట్టు కహానీలను వినిపిస్తుంటారు. దీన్నే ఫక్కా ప్రజాద్రోహం అంటాము. సమాజంలో నేడు మోసం, దగా, రాజకీయాల



ముసుగుల్లో అధికార దాహంతో, పవర్ పాలిటిక్స్ ప్రేరణతో యధేచ్ఛగా విందులు వినోదాల్లో మునిగి తేలుతున్నాయ్. సామాజిక విలువలు గాని దృక్పథం గాని లేని గాడితప్పిన భావజాలం ప్రజాస్వామ్యాన్ని భంగపాట్లకు గురిచేస్తుంది. ఇప్పుడు విప్లవాలు, ఉద్యమాలు నినాదాల్లో జాస్తిగా ఆచరణలో నాస్తిగా కనిపిస్తున్నాయి.

జీవితాంతం ఏ సాహిత్యకారునిలోనైనా వాఙ్మయ తపస్సు ఒకే ఒక లక్ష్యంతో ఉండడం అసంభవమే అవుతుంది. కాబట్టి కాలానుగుణ్యంగా ఊహాకోణాలు మారుతుంటాయి. ఏదో ఒక లక్ష్యానికి బ్రాండ్ అయిపోయే అవకాశం రచయితల్లో కనిపిస్తుంటూంది. ఆధునిక అభ్యుదయ భావాలకు "బ్రాండ్" గా మారడం, కాలమాన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న అనేకానేక అదృశ్యకోణాల్ని సాదృశ్యం చేయడం రచయిత ప్రతిభకు తార్కాణంగానే భావించాలి. రచయితను తాను అనుసరిస్తున్న "ఇజాన్ని" బట్టి అతని సంకుచిత దృక్కోణాన్ని బట్టి ఛాందసునిగా ముద్ర వేస్తారు. అనర్థక హేతువైన అయోమయంతో అభివ్యక్తితో వ్యక్తీకరణలు చేయడం ఆధునికత అనిపించుకోదు. రచయితకు ఒక విధమైన తత్త్వముండవచ్చు. మరో విధమైన మనస్తత్వముండవచ్చు. అయితే అతని కవిత్వం మాత్రం సమాజాన్ని పట్టి పీడిస్తున్న విధ్వంసక రీతులమీద 'ఫోకస్' అయి ఉండాలి. సమాజాన్ని హేతుబద్ధంగా అభ్యుదయం వైపు నడిపించేదిగా ఉండాలి. సనాతన ధర్మాన్ని తలకెత్తుకొని గతాన్ని గొప్పలు చెప్పడం, పూర్వ జన్మ కర్మల వలన పేదలు, పేదలుగానే మిగిలిపోతున్నారని ఉద్బోధించటం రచయితల అపరిపక్వత, అవగాహన లోపం సమాజం యెడల ఎంతగా వెనుకబడి ఉన్నదో తెలియ జేస్తుంటూంది.

సనాతన వాదాన్ని ఇంకా ప్రోత్సహిస్తున్న "మీడియా" ను ఏ విధంగా అర్థం చేసుకోవాలో అభ్యుదయ వాద బీజాలుపడ్డ జనమే నిర్ణయించుకుంటారు. సమకాలీన చైతన్యాన్ని అందిపుచ్చుకోకుండా, సనాతన అంధకారంలో మునిగి తేలుతున్న అభ్యుదయ నిరోధక రచయిత మనుగడకు కాలంచెల్లే రోజులు రావాలి. నడుస్తున్న కాలాన్ని బట్టి, మారుతున్న నాగరికత విధానాల్ని బట్టి అభ్యుదయ వాదులు కూడా సువిశాల దృక్పథంతో తులనాత్మక పరిశీలన, వారు రాసే రచనల మీద నెరపడం ఎంతైనా అవసరం. ఏ ప్రక్రియలో సాహిత్యాన్ని రాసినా అది ప్రజల నాకర్షించి సమకాలీన సాహితీ రంగంలో ఒక గౌరవప్రదమైన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలి. రచయిత తనదైన ముద్రతో గుర్తింపునకు రావాలి.

చాలామంది రచయితల్లో కొన్ని అపోహలు ఆధునిక ఆలోచనా విధానాలుగా స్థిరపడుతున్నాయి. మాతృభాషలో వెలువడుతున్న రచనలు కంటే పాశ్చాత్య భాషల్లో వెలువడే రచనలు మహోత్కృష్టగా ఉంటాయని వాటిని తర్జుమా చేస్తే జన్మ తరిస్తుందని భావిస్తుంటారు. తర్జుమాలు మాత్రమే చదివి అందలి పోకడలే వాళ్ల రచనల్లో రాస్తుంటారు. ఏదో నూతనత్వం అందున్నదని ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులు రివార్డులకు ముందు వరుసలో వాటిని పరిగణలోకి తీసుకుంటుంటారు. ఈ విధానం మన మాతృభాషలో వెలువడుతున్న సాహిత్యానికి గొడ్డలిపెట్టుగా తయారవు తుంది. నేడు వెలువడుతున్న అభ్యుదయ సాహిత్యంలో జీవిత సాఫల్యానికి కావలసిన అవకాశాలు ఉన్నాయా లేవా అనే అంశాల్ని పరిగణలోకి తీసుకోవాలి. రచయితల దృక్పథాలు నేడు తలెత్తుతున్న సమస్యలను ఎత్తిచూపేవి గాను పరిష్కార విధానపు ఆలోచనలకు బీజమేసేవిగాను ఉన్నది లేనిది గమనించాలి. ప్రోత్సహించాలి. సాహిత్యంలో వివక్షను అరికట్టినప్పుడే అభ్యుదయం సూర్యోదయమై వెలుగులు విరజిమ్ముతుంది అనడం అతిశయోక్తి కాదు.

నేను రైతునే..!

మట్టితో చెలిమి చేస్తాను
మొక్కలో కలిసిపోతాను
చేను సెలకల్లో ఒదిగిపోతాను
గట్టు పైన గంభీరంగా నిల్చుంటాను
గింజ గింజను గుండెకు హత్తుకుని
గిట్టుబాటు ధరకు నమస్కరిస్తాను

కాలువలో పంట కొట్టుకుపోతుంటే
కన్నీళ్లతో గొంతు తడుపుకుంటాను
ఎరువు లేక చేను సాగిలపడితే
ఓదార్చుతూ ఓ పక్కన ఒరిగిపోతాను
నిలదీసే స్థోమత కాస్తైనా లేనివాన్ని
తట్టుకునే ఓపిక అసలే కరువైనవాన్ని
నేను రైతునే అన్నం పెట్టే రైతునే

కోతకొచ్చిన పంటను
కౌగిలించుకుంటాను
మేతకొచ్చిన పశువును ఆదరిస్తాను
ధాన్యరాశి కుప్పనుచూసి ఆనందిస్తాను
నష్టపోతే సర్కారును బతిమలాడుతాను
పొద్దు ఎరుగని కష్టజీవి నేను
నిద్దరలోను పంటచేలునే కలవరిస్తాను

అరువు బండ నెత్తిన మోస్తూనే
బతుకు బండి మెల్లగా నడిపిస్తాను
ఎండ వాన వాగుతో చేతులు
కలుపుతూ
జీవన వంతెనపై మెల్లగా కదులుతాను
అన్నదాతను మరచిపోయిన నాడు
మెతుకుల కోసం వెంపర్లాడుతుంటే
తిరిగి నేనే బాధపడి మెతుకై
చేరుతాను.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

ప్రయాణం

నిన్నటి నుంచి నేటికీ
నేటి నుంచి రేపటికి
గమనమే ప్రయాణం!

చీకటి నుంచి వెలుగులోకి
చెడు నుంచి మంచికి
కదిలిపోవడమే ప్రయాణం!

దూరమెంతో తెలుసుకో
గమ్యమేమిటో నిర్ణయించుకో
దిశ ఏమిటో నిర్దేశించుకో!

జీవనం ఓ సుదీర్ఘ ప్రయాణం
ఎన్నో మలుపులు మజిలీలు
బంధాలు అనుబంధాలు!

అడుగుతో మొదలవుతుంది
వెనుక ఎవరూ లేకున్నా
వెనుకడుగు వేయకుండా సాగిపో!

ఓడిపోతే విజ్ఞాన యాత్ర!
సాగిపోతే విజయ యాత్ర!

జగ్గయ్య.జి,
9849525802

సరిలేరు మీకెవ్వరు

ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు తగ్గాయంటే
అరికాల్లోంచి వెన్నులోకి ఒణుకొస్తుంది
శీతలంపై రణభేరి మోగించే సమయమది
స్వెట్టర్లూ మంకీ క్యాపులు కొనేస్తారు
రగ్గులు బయటికి తీసి దుమ్ము దులుపుతారు
చలిమంటలేసి గరం గరం చాయ్‌తో
సందడి చేస్తూ నిశీధిని ఆస్వాదిస్తారు
ఇదంతా సగటు మానవుల కథ!
ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీలకు చేరినా
వేళ్లు కొంకర్లుపోతూ ఒళ్లు వంకర్లు తిరిగినా
శత్రువుల నుంచి దేశ రక్షణే వారి విధి

అస్త్రశస్త్రాలతో అనుక్షణం గస్తీ కాస్తూ
తుపాకులు తూటాలతో మోత మోగిస్తారు
ఇల్లూ వాకిలీ వదిలి ఐనోళ్లను మరిచి
నిరంతరం నిద్రలేని రాత్రులు గడుపుతారు
ఇది మనల్ని కాపాడే సైనికుల గాథ!

శర్మ సీహెచ్., 9440587567

విశిష్ట కథన నైపుణ్యం దేశరాజు సొంతం

గ్రంథ సమీక్ష

తెలుగు కథా ప్రపంచంలో నిత్యం మారుతున్నసమస్యలను కొత్త శిల్పంతో పట్టుకుని పాఠకుడి ముందుకు తీసుకువస్తున్న ఆధునిక రచయితల్లో దేశరాజుపేరును ప్రత్యేకంగా ప్రస్తావిం చాల్సిందే. కథకుడిగా, కవిగా, పాత్రికేయుడిగా మూడు రంగాల్లోనూ స్పష్టమైన దృష్టి వున్న రచయిత. నేటి జీవితంపై తన ఆత్మీయ అనుభవాలతో ఆయన రచనలు పాఠకుల మీద గాఢమైన ముద్ర వేస్తాయి. వీరి 'అలీబాబా అనేక దొంగలు' కథా సంపుటిలోని కథలని పరిశీలిస్తే ఆధునిక మనిషి జీవితంలో చోటు చేసుకుంటున్న విలాసవంతమైన కోరికలు, భ్రమలు, సాంకేతిక విప్లవం వల్ల వచ్చిన మానసిక ఒత్తిడులు, సామాజిక వ్యవస్థలోని విరుద్ధతలు, మృగ్యమైన మానవ సంబంధాలు దేశరాజు కలంలో ప్రతిఫలిస్తాయి.

మృదువైన కవిత్వ శైలితో కూడిన వాక్యాలను కథా గమనంలో కలిపి, వాస్తవం మన కళ్ల ముందు నిలబెట్టే కళ ఈ రచయితకు గల ప్రత్యేకత. ఈ సంపుటిలోని ఐదు కథలు- 'కుదుపు', 'ఎయిర్ జామ్', 'అంతా మీ కోసం!', 'అబద్ధం', 'అవాంఛితం'- రచయిత శైలిని, మనో వైజ్ఞానిక లోతులను, నిశితమైన పరిశీలనను, పరిశోధనను ప్రతిబింబిస్తాయి. 'కుదుపు'కథలో సాంకేతిక మత్తులో కోల్పోయే మానవత్వం ప్రదర్శితమౌతుంది. ఈ కథలో చూపిన చిన్నారి మరణం కేవలం సంఘటన కాదు. ఒక కాలపు మనోవ్యాధి. మొబైల్ అనే చిన్న పరికరం మన సంబంధాలలో, మన శ్రద్ధలో, మన విలువల్లో ఎంత పెద్ద కుదుపు తెచ్చిందో ఈ కథ గుండె పగిలే సంఘటనలతో మనలో ఆలోచనలను రేకెత్తిస్తుంది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం, సాంకేతిక మత్తు, కుటుంబాల్లో పెరుగుతున్న భావోద్వేగ ఖాళీ - అన్నీ ఈ కథలో ఒకే దారంలో నడుస్తూ చివరికి భయంకర వాస్తవంతో ముగుస్తాయి. చిన్న చిన్న మాటలతో సాగిన కథనం లోతైన బాధను గుండెల్లో మిగులుస్తుంది.

ఉత్కంఠ, భయం, ధైర్యం సన్నివేశాల సమ్మేళనం 'ఎయిర్ జామ్' కథ. ఉగ్రవాదం-భద్రత-మనిషి ధైర్యం అనే మూడు కోణాలతో కూడిన ఈ కథ సినిమా కన్నా ఉద్వేగభరితమైన అనుభవాన్ని మనకు పంచుతుంది. విమానంలో అకస్మాత్తుగా సృష్టించిన భయానక వాతావరణం, ప్రతి చిన్న సంఘటనలో దాగిన ఆందోళన, సాధారణ మనిషిలో దాగిన అసాధారణ ధైర్యం అన్నీ ఈ కథను యాక్షన్ సినిమాలా, మనో వైజ్ఞానిక రీతిలోనూ పాఠకులను ఆకర్షిస్తుంది. మాటల క్రమం, సంఘటనల వేగం, భావాల సంక్లిష్టత-అన్నీ గట్టిగా కలిశాయి. వాంఛలు, కలలు, వాస్తవాలు కలబోసిన కథ 'అంతా మీ కోసం'. పల్లెటూరి యువకుని ఆశలు, తన గ్రామానికి తిరిగివచ్చి పొందాలనుకునే కల, ప్రేమ కలిగిన అతని స్వీయ నిర్మిత స్వప్నాలు ఈ కథలో చిన్న నవలంత లోతును ఇస్తాయి.



ఒక చిన్న అపార్థం, ఒక మలుపు కథను వాస్తవానికి తీసుకు వస్తాయి. కల్పనలతో జీవించే యువతరం ఎదుర్కొంటున్న విలాస భ్రమలు, అపనమ్మకాలు, వాస్తవం ఇచ్చే కఠిన పాఠం- ఇవన్నీ కథలో ప్రతిబింబిస్తాయి.

ప్రేమ, భయం, నైతికతల మధ్య నలిగిన మనిషికథే 'అబద్ధం'. భార్య కేన్సర్ పరీక్షా ఫలితాలు మనోధైర్యాన్ని కృంగదీసినా, ఆమెను బాధపెట్టకూడదనే ప్రేమతో "అన్నీ బాగున్నాయి" అనే అబద్ధం చెబుతున్న భర్త. అతడి హృదయంలో జరిగే అంతఃసంఘర్షణ మనమనస్సుల్ని దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. నిజం చెప్పి ఆమెను బాధపెట్టాలో, అబద్ధం చెప్పి అనునయించాలో తెలియని అయోమయంలో, కొనాళ్ళపాటైనా ఆమెను మనఃశాంతిగా ఉంచాలన్న ఆలోచనతో ఏర్పడిన ఈ గందరగోళంలో మనిషి నీతిని ఏ పక్క నిలబెడుతుందని కథ ప్రశ్నిస్తుంది. మన చుట్టూ కనిపించే కానిస్టేబుల్, దుకాణదారుడు వంటి పాత్రల ద్వారా నైతికత యొక్క బోసి గీతలను రచయిత అందరికీ దృశ్యమానంచేశారు. ఈ కథ మన భావోద్వేగాల ముసుగులు, మన బలహీనతల సత్యాలను పట్టిచూపించే దర్పణం.

దాంపత్య బంధంలో అజ్ఞాత ఆకాంక్షల మనోవ్యధే 'అవాంఛితం' కథ. సాధారణ దాంపత్య జీవితంలోని సున్నిత విరుద్ధతలను సహజత్వం పోకుండా, సరళమైన భాషలో దేశరాజు మలిచిన కథ ఇది. భార్య చిన్నకోరిక కూడా ఇంట్లో 'అవాంఛితం' అయిపోవడం, జీతాలు, సౌకర్యాలు సమానమైనా స్వేచ్ఛ మాత్రం స్త్రీకి అందని ద్రాక్షగా మారడం, ఏసీ గది ఒక చిన్న హక్కు కాకుండా స్వాతంత్ర్యానికి రూపకంగా మారడం వంటి అంశాలతో ఈ కథ ఆధునికఇళ్లలో కనిపించని బంధనా లను పాఠకుడి ముందుకు గట్టిగా తీసుకువస్తుంది. భావోద్వేగ స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో, సంబంధాల్లో ఓపికలేని మాటలెంత నొప్పినిస్తాయో, అణచివేత ఎక్కడ మొదలవుతుందో కథ చెబుతుంది. ఈ కథా శీర్షిక 'అవాంఛితం' కథానాయిక అంతర్మనస్సులోని మౌన అరుపు అనడం అతిశయోక్తి కాదు. అన్ని కథల గురించి చెప్పడం సమంజసం కాదు. అయితే, ఇతరకథలు కూడా సమాజంలోని అంతర్భాగాల ప్రతిధ్వనులే. ఈ సంపుటిలోని 'కాసేపు మనిషి', 'కవిదుర్భేధ్య', 'సహజా సహజం', 'ఆలీబాబా అనేక దొంగలు', 'చిలుక', 'తల్లీకూతురు మధ్యలో ఆమె', 'బహురూపి', 'రిక్షావోడు' వంటి కథలన్నీ మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబిస్తాయి.

ఇల్లు, ఆఫీస్, సమాజం మధ్య నలిగే మానవ సంబంధా ల్లోని చిన్న చీలికలు, రోజువారీ మనస్తాపాల వెనుక దాగిన పెద్ద వేదనలు, నగరం-పల్లె మధ్య దూరాలు, మనిషి పోరాటాల్లోని గాయాలు-ఇవన్నీ దేశరాజు కథా స్రవంతిలో ప్రత్యేకమైన లయలో ప్రవహిస్తాయి. అవలోకనం, విమర్శ, మానవత్వం మూడు కలిసి ఈ కథల్ని ఓ ప్రత్యేక శ్రేణిలో నిలబెడతాయి. తేలికైన భాషతో, తేటయైన భావాలతో, కవిత్వపు మృదుత్వం కలిగిన వాక్యాలతో కథాశైలి ఉంటుంది. మాటలకంటే భావాలకు ప్రాధాన్యంఇచ్చారు. శిల్పం విషయానికివస్తే సంఘటనల క్రమాన్ని కట్టుదిట్టంగా అమర్చి, చివర్లో తప్పనిసరిగాఆలోచింపజేసే ముగింపుఇచ్చారు రచయిత. ఆధునిక జీవితం, మనుషుల మధ్య సంబంధాల్లోని ఒత్తిడులు, సాంకేతిక ప్రభావాలు, సామాజిక వైరుధ్యాలే ఈ కథల్లోని అంశాలు. ఏసీ గది, మొబైల్, విమానం వంటి వస్తువులను వస్తువులుగా కాకుండా మనస్తత్వాల ప్రతీకలుగా తీసుకున్నారు. అతి సహజంగా మనం తెలిసినవాళ్లే అన్నంత దగ్గరగా ఈ కథాసంపుటిలోని పాత్రలు కళ్ళముందుగోచరమౌతాయి. వీరికి గలపాత్రికేయ దృష్టి వలనప్రతి కథలో 'వాస్తవం' బలంగా నిలబడేలా చేసే శైలి పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. మన జీవితాల్లోని చిన్న గొడవలు, పెద్ద ఒత్తిడులు, అణిచివేతలు, దురాశలు, ప్రేమలు, భయాలు ఇవన్నీ కథల రూపంలో మన ముందుకు రావడం ఈ సంపుటిలో కథల విశిష్టత. చివరగా, దేశరాజు కథలలో జడ్జిమెంట్ ఉండదు-మనిషి ఉంటాడు. అభ్యంతరాలు ఉండవు-అనుభవాలు ఉంటాయి. ఇవే ఈ రచయితలోని కథాగమన నైపుణ్యానికి చిహ్నాలని ఖచ్చితంగా చెప్పొచ్చు.

పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, 8179636617

భిన్న అంశాల కవితావేదిక

కవిత్వం పాఠకుల మదిలోకి తొందరగా చొచ్చుకుపోయే రచనా ప్రక్రియగా భావించవచ్చు. ఏ అంశంమీదనైనా చిన్న పదాలతోనే అర్థవంతంగా చెబుతూ చదువరుల్లో ఆ అంశానికి సంబంధించిన విషయాన్ని వారి మనసుల్లో ముద్రిత మయ్యేంత ప్రభావం కలిగిఉంటుంది. అటువంటి కవితల వేదిక ప్రొఫెసర్ కేశవకుమార్‌గారి 'ఆదిమ పౌరుడు'. ఆ ఒక్క క్షణం/ అగ్గిలా కురిసిన కన్నీటిధార/ తెల్ల బోయిన కలల ప్రపంచం/వెలేసిన శ్వేత రాత్రుల్లో/ విరగబూసిన నల్లమల్లెలెల్లె/ వోలే వోలే హల్లే/ తెల్లగుర్రమెక్కిన నల్ల చందమామెల్లె/ నల్ల సముద్రం లోంచి/ పుట్టుకొచ్చిన ఎర్ర సూరీడెల్లె..' అంటూ 'వొలె వొలె హల్లె' కవిత సాగుతూ 'వోలెలె హల్లే/ ఏవదేమనుకున్నా మనమిప్పుడు/తిరగబడ్డ జాతి గుండె చప్పుల్లం/ఆత్మగౌరవ పాటలమై/ఎగిసి పడుతున్న ఫీనిక్సు పక్షులం/ వొలమ్మే హల్లే/ నీ కోసమే/ మోసుకొచ్చిన ఈ ఆటలెల్లడి/అంటరాని ఎన్నెల పాటని అందుకోవే!' అంటూ హాలీవుడ్ నల్లజాతినటి



హల్లె బెర్రికి ఉత్తమనటిగా ఆస్కార్ అవార్డు ప్రకటించిన సందర్భంలో నల్లజాతీయులపై అక్కడి వివక్షలనడుమ నటిగా ఆమెవిజయాన్ని అభినందిస్తూ సాగే కవిత ఇది.ప్రేమ వివాహాల నేపథ్యంలో అనేక గొడవలు జరగడం ప్రేమికులు చనిపోవడం అప్పుడప్పుడు చదువుతునే ఉంటాం. ఎన్నో ప్రేమలకు కులం, డబ్బు, సంబంధిత మనుషుల చేతలు ఇలా ఎన్నో కారణ మవుతాయి. ప్రేమను అందమైన ఆలోచనగా అభివర్ణిస్తూనే ప్రేమికులు ఎదుర్కొనే సంఘర్షణ, ఇబ్బందులను తెలుపుతూ 'ప్రేమి'కులం' కవితలో 'కులం' ప్రేమికులక్రూరత్వాన్ని తెలుపుతారు.

'నాకు ఏ దేశమూ లేదు/సరిహద్దులెరుగని నడక/పాసుపోర్టు లేని దేశం నాది/ఓటర్ లిస్టులో జారిపోయిన పేరు/రేషన్ కార్డు లేని బతుకు రాత/ఊరులేని నిత్య వలస/నా పేరున ఏ సెల్‌ఫోన్‌లోనూ మోగదు/ఆధార్‌లు ఆచ్ఛేదాలు లేని అభద్రమ్!... అంటూ ఆదిమపౌరుడు గురించి తెలుపుతూ ఆకలితో, దాహంతో తానున్నదే తన దేశంగా ముందుకు సాగుతూ ఎడారుల్లో, లోయల్లో, మైదానాల్లో, అడవుల్లో బతుకుపోరాటంగా పడిలేస్తూ పరిగెడుతున్నాడు. కులం నుంచి, మతం నుంచి, రాజ్యబంధనాల విముక్తుడై, భయం లేకుండా, భవిష్యత్‌పై ఊహలేకుండా ముందుకు సాగుతున్నాడు. 'నాకు హద్దుల్లేవిప్పుడు బతుకు పొద్దు గురించి ఆలోచన లేదు' అని తన ఆలోచనను, స్వేచ్ఛను తెలుపుతూ రాజ్యానికి దేశభక్తికి అవతల నుంచున్న ప్రపంచ ప్రథమపౌరుడిని నేను' అంటారు 'ఆదిమపౌరుడు' కవితలో. ఇలా ఇందు లోని 50 కవితలు దేనికదే ప్రత్యేకతను కలిగి పాఠకులను అలరిస్తాయి. ప్రొఫెసర్‌గా అటు విద్యార్థిలోకాన్ని తన బోధనల ద్వారా వారి బాధ్యతలను గుర్తుచేస్తూ మంచిపౌరులుగా తీర్చిదిద్దుతూ, రచయితగా ఇటు సాహితీప్రియులకు తన రచనాపటిమతో మెప్పిస్తూ సాహితీ లోకంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు ఈ ఆదిమపౌరుడు రచయిత కేశవ కుమార్. ఇందలి కవితలతోనే కాదు కవర్‌పై ఫోటోతోనూ దీని ప్రత్యేకతను తెలియజెప్పిన రచయిత, ప్రచురణకర్తలు అభినందనీయులు.

ఆదిమపౌరుడు-కేశవకుమార్, పేజీలు:151, వెల: రూ.150/-

ప్రతులకు: ప్రొ. పి. కేశవకుమార్ సి-8, మౌరిస్ నగర్, ఢిల్లీ యూనివర్సిటీ ఫ్లాట్స్ ఢిల్లీ-110007, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్. న్యూ విశాలాంధ్ర బుక్‌సెంటర్, హైదరాబాద్.

-కౌశిక

కాంగ్రెస్‌కు పీకే చేదోడు

- ప్రియాంకతో రహస్య భేటీ వెనుక కథేంటి?
- ఇండియా ఐక్య సంఘటనలోకి జన్‌సురాజ్!
- వచ్చే ఏడాది వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ప్రశాంత్ కిశోర్ దృష్టి

న్యూఢిల్లీ: సొంతంగా పార్టీ స్థాపించి ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలిపిన ఎన్నికల వ్యూహకర్త, జన్‌సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిశోర్ ఇండియా ఐక్యసంఘటనకు చేరువవుతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకాగాంధీతో ఇటీవల ఆయన భేటీ కావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. డిసెంబరు 15న ఢిల్లీ వేదికగా దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ ప్రైవేటు సమావేశంలో ఇరువురు నేతలు ఏయే అంశాలపై చర్చించారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతుండగా... బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం ఒక ప్రధాన ప్రాజెక్టును ప్రశాంత్ కిశోర్ చేపడతారనే ప్రచారం మొదలైంది. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా హస్తం పార్టీకి పీకే చేదోడుగా నిలిచే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మీడియా ప్రశ్నపై ప్రియాంక ఎదురుదాడి...

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రియాంకా గాంధీ వచ్చినప్పుడు, ప్రశాంత్ కిషోర్‌తో భేటీపై ఆమెను మీడియా ప్రశ్నించగా... ఇది కూడా ఒక ప్రశ్నేనా? అని ఆమె బదులిచ్చారు. "కేంద్ర ప్రభుత్వం లోక్‌సభను ఎందుకు పనిచేయనివ్వడం లేదు. సభ కార్యకలాపాలకు పదే పదే అంతరాయం ఎందుకు కలిగిస్తోంది ? ఈ విషయాలపై మీరు ఎందుకు అడగరు?" అని ఎదురు ప్రశ్నవేశారు. అయితే ప్రశాంత్ కిశోర్‌కు కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష ఇండియా ఐక్యసంఘటనలోని అన్ని పార్టీల అగ్రనేతలతోనూ బలమైన సంబంధాలు ఉన్నాయి. తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీలకు కూడా పీకే సన్నిహితుడే. కేరళ, అసోం రాష్ట్రాల రాజకీయ సమీకరణాలపైనా ఆయనకు అవగాహన ఉంది. ఇటీవలే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి ఓటమి చవిచూడటంతో ఆ కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారిందనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో పీకే సుదీర్ఘ అనుభవాన్ని, విస్తృత రాజకీయ పరిచయాలను వినియోగించుకోవాలనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉండొచ్చని భావిస్తున్నారు. ఇందుకోసమే ప్రియాంకాగాంధీతో పీకే భేటీ అయి ఉండొచ్చని అంటున్నారు. భవిష్యత్ రాజకీయ ప్రణాళికలు, సమీకరణాలపై వారి మధ్య చర్చ జరిగి ఉండొచ్చని చెబుతున్నారు. ఈ అంశంపై జన్ సురాజ్ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి ఏం చెబుతున్నారంటే... బీజేపీకి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలనే ప్రశాంత్ కిశోర్ భావిస్తున్నారని...ప్రియాంకతో జరిగిన సమావేశంలో ఇది స్పష్టమవుతోందని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రియాంకా గాంధీ, మమతా బెనర్జీ లాంటి నేతలను పీకే కలుస్తున్నారని... బీహార్ తరహాలో ఇతర రాష్ట్రాల్లో బీజేపీకి గెలుపు దక్కకుండా అడ్డుకోవాలనే సంకల్పంతో పీకే ఉన్నారని మనోజ్ భారతి స్పష్టం చేశారు. అయితే పీకే ప్రయత్నాలకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షపార్టీల నుంచి రాబోయే రోజుల్లో ఎలాంటి మద్దతు లభిస్తుందనేది కీలకం.

బీహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణాలను తెలుసుకుంటున్నామని... వాటిని సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసుకుంటామని భారతి తెలిపారు. 'మేం మా అసెంబ్లీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించాం. కనీసం రెండున్నర నెలల ముందే అభ్యర్థులను మేం ప్రకటించి ఉంటే, పరిస్థితి భిన్నంగా ఉండేది. మా పార్టీ ఇప్పుడు బీహార్‌లో బ్లాక్ స్థాయిలో బలంగా ఉంది. జన్ సురాజ్ పార్టీకి ఓట్లు వేస్తే ఆర్జేడీ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందనే భయాన్ని ఎన్నికల టైంలో వ్యాపింపజేశారు. ఇది మా పార్టీకి ప్రతికూలించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి సరిగ్గా కొన్ని రోజుల ముందు కోట్లాది మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10వేలను నితీశ్ సర్కారు జమచేసింది. తద్వారా ప్రజలను ప్రలోభపెట్టింది. దీనిపై మేం హైకోర్టు,సుప్రీంకోర్టులలో రిట్ పిటిషన్ దాఖలు చేయబోతున్నాం" అని మనోజ్ భారతి పేర్కొన్నారు.

జన్‌సురాజ్ విస్తరణపై త్వరలో నిర్ణయం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రశాంత్ కిశోర్ కొంత విరామం తీసుకొని పట్నాకు తిరిగి చేరుకున్నారు. ఆయన జనవరి 15 తర్వాత రాష్ట్రంలో మళ్లీ పాదయాత్రను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. బీహార్‌లోని ప్రతీ బ్లాక్‌ను కవర్ చేస్తూ ఈ యాత్ర ఉంటుందని జన్ సురాజ్ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలకు పార్టీని ఇప్పుడే విస్తరించాలా వద్దా అనే దానిపైనా జనవరి 15 కంటే పీకే ఒక నిర్ణయాన్ని తీసుకుంటారని సమాచారం.

పీకే, కాంగ్రెస్ మధ్య గ్యాప్ పెంచిన '2022'

కాంగ్రెస్‌కు కలిసిరాని పీకే వ్యూహాలు

ప్రశాంత్ కిశోర్ రాజకీయ వ్యూహకర్తగా విజయవంతమయ్యారు. ఆయన్ను సలహాదారుగా పెట్టుకున్న అనేక ప్రాంతీయ పార్టీలు ఆశించిన ఫలితాలను సాధించాయి. కానీ కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆయన ఎన్నికల వ్యూహాలు కలిసి రాలేదు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీలతో పీకే ఏర్పాటు చేయించిన కూటమి విజయవంతం కాలేదు. అయినప్పటికీ ప్రతిపక్ష కూటమిలోని అన్ని పార్టీలతో పీకేకు మంచి సంబంధాలే ఉండేవి. ఈక్రమంలో 2021లో కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశమైన పీకే, మొత్తం పార్టీని పునర్ వ్యవస్థీకరణ చేస్తేనే భవిష్యత్ ఎన్నికల్లో గెలవడం సాధ్యమవుతుందని ప్రతిపాదించారు. అనంతరం అనేకమార్లు కాంగ్రెస్ అగ్రనేతలతో దీనిపై ఆయన చర్చించారు. చివరకు 2022 ఏప్రిల్‌లో కాంగ్రెస్ పార్టీ పునర్ వ్యవస్థీకరణ ప్లాన్‌ను ప్రియాంకాగాంధీ, రాహుల్ గాంధీ సమక్షంలో సోనియాగాంధీకి పీకే సమర్పించారు.

అవసరమైతే తాను కూడా కాంగ్రెస్‌లో చేరతానని అప్పట్లో పీకే ప్రతిపాదించారు. కానీ కాంగ్రెస్ పార్టీ పునర్ వ్యవస్థీకరణ ప్లాన్‌ను సోనియా తిరస్కరించారు. ఈవిధంగా పీకే, కాంగ్రెస్ పార్టీ మధ్య దూరం ఏర్పడింది. ఈనేపథ్యంలో 2026లో జరగబోయే నాలుగు కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టితో పీకే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈవిషయంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలనే ఆసక్తితో ఉన్నారని... ఇందుకోసమే ప్రియాంకాగాంధీ ద్వారా మార్గం సుగమం చేసుకునే ప్రయత్నంలో పీకే ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

మంచు దుప్పట్లో జమ్మూకశ్మీర్

శ్రీనగర్: ఉత్తర భారతదేశం చలికి వణుకుతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో హిమపాతం మొదలైంది. ఎత్తైన భూభాగాల్లో హిమపాతం పెరిగి లోయలోని వివిధ ప్రాంతాల కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఘనీభవన స్థానం కంటే దిగువకు పడిపోయాయి. జలవనరుల ఉపరితల భాగాల్లో పలుచని మంచు పొరలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గుల్‌మార్గ్‌లోని స్కై రిసార్ట్, సోనామార్గ్, దూద్‌పత్రి సహా దక్షిణ, ఉత్తర కశ్మీర్‌లోని ఎత్తైన ప్రాంతాలలో భారీగా మంచు కురుస్తుండటంతో ఆ ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. కశ్మీర్ అంతటా పరుచుకున్న మంచు దుప్పటి ఓ వైపు పర్యాటకులను ఆకర్షిస్తుండగా... మరోవైపు భారీగా మంచు పేరుకుపోయి పెద్ద సంఖ్యలో రోడ్లను మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం కారణంగా వివిధ చోట్ల కొండ చరియలు విరిగిపడటంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. రహదారిపై అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మంచు తీవ్రత పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శీతాకాల సంసిద్ధతపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భారీ హిమపాతాన్ని ఎదుర్కోవడానికి రోడ్ క్లియరెన్స్, నిరంతర విద్యుత్తు సరఫరా, తాగునీటి లభ్యత వంటి వాటిపై దృష్టి సారించినట్లు సీఎం పేర్కొన్నారు.

భూమిపైకి దూసుకొస్తున్న స్టార్‌లింక్ శాటిలైట్

వాషింగ్టన్: ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్టులోని శాటిలైట్స్‌లో ఒకటి ఇటీవల అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపు వస్తోంది. ఈ నెల 17న శాటిలైట్ 35956 భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. అది హఠాత్తుగా అక్కడి నుంచి కూలిపోవడం మొదలైంది. దానిపై నియంత్రణను స్పేస్‌ఎక్స్ కోల్పోయింది. ఆ తర్వాత ఆ సంస్థ దీనిపై వివరణ ఇచ్చింది. "హఠాత్తుగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడింది. దీంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలు విడిపోయి మెల్లగా కదలడం మొదలుపెట్టాయి. వారం రోజుల్లోగా భూవాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చు" అని ఎక్స్‌లో పోస్టు చేసింది. శనివారం ఈ ఉపగ్రహ శకలాలు అమెరికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా.. వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వరల్డ్‌వ్యూ-3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎటువంటి ముప్పు లేదని స్పేస్‌ఎక్స్ చెబుతోంది. ప్రస్తుతం అది ఐఎస్ఎస్ కంటే కిందే ఉందని వెల్లడించింది. అది లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ఉండటంతో... భూగురుత్వాకర్షణ శక్తి దానిని సులువుగా లాగేస్తుందని వెల్లడించింది. ఇవి వాతావరణ ఘర్షణతో కాలిపోయే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం స్టార్‌లింక్ ప్రాజెక్టు కింద 9,000 ఉపగ్రహాలను స్పేస్‌ఎక్స్ అంతరిక్షంలోకి పంపింది. దీంతో భూమిపై మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్‌ను సరఫరా చేయగలుగుతోంది. అమెరికాలోని నాసా, యూఎస్ స్పేస్‌ఫోర్స్‌తో సమన్వయం చేసుకొంటూ పనిచేస్తోంది.

కల్పితం, రాజకీయ ప్రేరేపితం

నేషనల్ హెరాల్డ్ కేసుపై కాంగ్రెస్ నేత చిదంబరం

చెన్నై : నేషనల్ హెరాల్డ్ కేసును కల్పితం, రాజకీయ ప్రేరేపిత కేసు అని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం ఆదివారం అభివర్ణించారు. చెన్నై సత్యమూర్తి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిందని చిదంబరం విమర్శించారు. డబ్బు జాడ లేనప్పుడు లావాదేవీ చట్టబద్ధమైనదా లేదా చట్టవిరుద్ధమా అని ఎవరైనా ఎలా నిర్ణయించగలరని ఆయన ప్రశ్నించారు. 'ఇది కల్పితం, రాజకీయ ప్రేరేపిత కేసు... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీవ్రమైన తప్పు చేసింది. వాస్తవానికి, అది చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడింది... డబ్బు లావాదేవీ లేనప్పుడు అది చట్టబద్ధమైనదా లేదా చట్టవిరుద్ధమైనదా అని ఎవరైనా ఎలా క్లెయిమ్ చేయగలరు?. ప్రభుత్వం ఇంకా అభ్యర్థన దాఖలు చేసినట్లు సమాచారం లేదు. వారు అభ్యర్థన ముందుకు సాగితే, అది వివేకం లేకపోవడాన్ని మాత్రమే చూపిస్తుంది' అని చిదంబరం తెలిపారు.

టీటీపై 'జైహో' ముఠా దాదాగిరి

టికెట్ లేకుండానే యూపీ నుంచి రామేశ్వరానికి 300 మంది రాక

చెన్నై: టికెట్టు కొనకుండా ఏకంగా ఉత్తరప్రదేశ్ నుంచి 300 మంది ప్రయాణికులు రామేశ్వరానికి వచ్చారు. వారిని ఓ రైల్వే టీటీ పట్టుకోగా జైహో... జైహో అన్న నినాదాలతో బయటకు పరుగులు తీశారు. వివరాలిలా... ఉత్తరాది రాష్ట్రాల నుంచి నిత్యం రామనాథపురం జిల్లా రామేశ్వరం రైళ్లు వచ్చి వెళ్తుంటాయి. ఉత్తరాది నుంచి వచ్చిన రైళ్లలో దిగిన ప్రయాణికులపై అనుమానాలు నెలకొన్నాయి. ఒక రైలులో పెద్దసంఖ్యలో దిగి వచ్చిన వారంతా నెత్తిన బ్యాగులు, సంచులను పెట్టుకుని దిగి ప్లాట్ ఫాంపైకి చేరారు. వీరి వద్ద టికెట్టు కలెక్టర్ తనిఖీ చేయగా, తామెవ్వరూ టికెట్లు కొనుగోలు చేయలేదంటూ సమాధానం ఇవ్వడంతో షాక్‌కు గురయ్యాడు. వారందరికీ జరిమానా విధించేందుకు టీటీ సిద్ధమయ్యాడు. అలాగే ఇతర సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే వారు వచ్చేలోపు ఈ 300 మంది టీటీపై తిరగబడ్డారు. తమకు టికెట్టు తీసుకునే అలవాటు లేదంటూ గదమాయించడం మొదలెట్టారు. అంతే కాదు జైహో... జైహో అని నినదిస్తూ అందరూ రైల్వే స్టేషన్ బయటకు పరుగులు తీయడంతో టీటీ విస్తుపోయాడు. తాజాగా వీరంతా బయటకు తప్పించుకు వెళ్లినా, తిరుగు ప్రయాణంలో పట్టుకునేందుకు ముందు జాగ్రత్తలలో రామేశ్వరం రైల్వే వర్గాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. కాగా, ఉత్తరప్రదేశ్ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో టికెట్ తీసుకోకుండా ప్రయాణికులు తరలి వస్తుంటే, మార్గం మధ్యలోని ఇతర స్టేషన్లు, ప్రధాన జంక్షన్‌లలో టీటీలు ఎవరూ సోదాలు చేయక పోవడం చర్చనీయాంశంగా మారింది. వారంతా రోజువారీ కూలీలు, పేదలుగా భావిస్తున్నట్లు తెలిసింది.

గాయనిపై దాడికి తృణమూల్ నేత యత్నం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఒక గాయనిపై అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) కార్యకర్త దాడికి యత్నించాడు. తూర్పు మిద్నాపూర్‌లో ఒక పాఠశాలలో లైవ్ ప్రదర్శన ఇస్తున్న సమయంలో సెక్యులర్ సాంగ్స్ పాడనందుకు టీఎంసీ స్థానిక నాయకుడు తనను వేధించాడని, శారీరకంగా దాడి చేస్తానని బెదిరించాడని ప్రముఖ బెంగాల్ గాయని లగ్నిజిత చక్రవర్తి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం భగవాన్‌పూర్‌లోని ఒక స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఈ మేరకు చక్రవర్తి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మెహబూబ్ మాలిక్ అనే వ్యక్తి వేదికపైకి ఎక్కి అందరూ చూస్తుండగానే తనపై దాడి చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపించారు. సింగర్ "జాగో మా" అంటూ దుర్గామాత పాట పాడిన తర్వాత ఆమెను అడ్డుకోవాలని ప్రయత్నించాడు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని ఆమె కోరింది. సెక్యులర్ సాంగ్స్ పాడనందుకే సింగర్‌ను లక్ష్యంగా చేసుకున్నాడని బీజేపీ ఆరోపించడంతో ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఘటనపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీజేపీ నేత శంకుదేబ్ పాండా ఆరోపించారు. కేసు నమోదు చేయడానికి బదులుగా "సారీ" చెప్పించే ప్రయత్నం చేశారని అన్నారు. 48 గంటల్లో మాలిక్‌ను అరెస్ట్ చేయకుంటే నిరసన చేపడుతామని బీజేపీ హెచ్చరించింది.

ఆర్ఎస్ఎస్‌ను రాజకీయ కోణంలో చూడొద్దు: మోహన్ భగవత్

కోల్‌కతా: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ను రాజకీయ కోణంలో చూడటం అతిపెద్ద తప్పు అని, సంఘ్ అధ్యక్షుడు మోహన్ భగవత్ అన్నారు. బీజేపీతో ఆర్ఎస్ఎస్‌ను పోల్చడంతో ప్రజల్లో తరచు అపార్థాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత కలిగిన సంఘ్‌సేవక్‌లను సృష్టించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, బలమైన దేశాన్ని నిర్మించడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి తమ అభిప్రాయం చెప్పే హక్కు దేశంలో ప్రతివ్యక్తికి ఉందని, కానీ అది వాస్తవికత ఆధారంగా ఉండాలని భగవత్ అన్నారు. సంఘ్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, దేశమే తొలి ప్రాధాన్యం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ కార్యకర్తలు పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. సంఘ్ చేస్తున్న ఈ కృషితో భారత్ మళ్లీ విశ్వగురువుగా మారుతుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలు: జైశంకర్

ముంబై: తన దృష్టిలో శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. భారత దేశ సంస్కృతి సంప్రదాయాలు, పాలనాపరమైన విధానాలు, రాజకీయాలపై ఆదివారం పూణెలోని పుస్తక మహోత్సవంలో దౌత్యవేత్తల విధుల గురించి మాట్లాడారు. భారత్‌కు వ్యూహాత్మక రాజకీయాలు, రాజ్య నిర్వహణ తెలియవని అనేకమంది విదేశీ రచయితలు పుస్తకాలలో రాసిన వ్యాఖ్యలను పదేపదే చదివి విసిగిపోయానని అన్నారు. మనమంతా సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పాటిస్తూ పెరిగామని జై శంకర్ చెప్పారు. ఇవన్నీ విదేశీయులకు తెలియవు కాబట్టి... ఎన్నో ఏళ్లుగా భారత్ పాటిస్తున్న రాజనీతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నట్లు తెలిపారు. రామాయణంలోని ప్రజాపాలన, సంక్లిష్ట పరిస్థితులు, రాజకీయ వ్యూహాలు మన పరిపాలనా విధానాలను తెలియజేస్తాయన్నారు. ఆ సమయంలో హనుమంతుడు దౌత్యవేత్తగా తన విధులను ఎంతో చక్కగా నిర్వహించాడని చెప్పారు. సీతకు సంబంధించిన సమాచారం తీసుకురమ్మని ఒక్క పనిమీద లంకకు పంపితే... అక్కడికి వెళ్లిన హనుమంతుడు పది పనులు చేసుకువచ్చాడని, సీతలో మనోధైర్యాన్ని, రావణుడిలో భయాన్ని నింపాడని జైశంకర్ పేర్కొన్నారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు కూడా కౌరవులు, పాండవుల మధ్య సంధి కోసం ప్రయత్నించాడని, యుద్ధంలో ధర్మంవైపు నిలబడ్డాడని చెప్పారు. అంతకంటే గొప్ప దౌత్యవేత్తలను మనం ఇంకెక్కడ చూడగలమని ప్రశ్నించారు. వారిని ఆదర్శంగా తీసుకుని తాను కూడా ప్రధాని మోదీ నాయకత్వంలో ముందుకు వెళుతున్నానని చెప్పారు.

కాంగ్రెస్ చెడగొట్టిన వ్యవస్థలు సరిచేస్తున్నాం

ప్రధాని నరేంద్ర మోదీ

గుహవతి: కాంగ్రెస్ పార్టీ దేశవ్యతిరేక కార్యకలాపాలతో పాటు బంగ్లాదేశ్ పౌరులు భారత్‌లో స్థిరపడేందుకు సాయం చేస్తోదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలను వినే దిక్కులేదని...తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అసోంలో రెండో రోజూ పర్యటించిన ప్రధాని మోదీ, డిబ్రూగడ్‌లో రూ. 10 వేల 601 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బ్రౌన్ ఫీల్డ్ యూరియా ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ది అస్సాం వ్యాలీ ఫెర్టిలైజర్ కంపెనీ లిమిటెడ్ 2030 నాటికి ఏటా 12.7లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ యూరియా ప్లాంట్‌ను నిర్మించనుంది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో సాంకేతికత పాతదైపోయి ఎరువుల ప్లాంట్‌లు మూతపడినప్పటికీ పట్టించుకోలేదని... 2014లో దేశంలో యూరియా ఉత్పత్తి 225 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా పది, 11 ఏళ్లు కష్టపడిన తర్వాత అది 306 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని మోదీ వివరించారు. కాంగ్రెస్ పాలిత ఇతర రాష్ట్రాల్లోనూ అనేక యూరియా పరిశ్రమలు మూతపడగా... అప్పుడు రైతులు యూరియా కోసం బార్లు తీరేవారని... యూరియా దుకాణాల్లో పోలీసులను మోహరించేవారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చెడగొట్టిన ఈ వ్యవస్థలను సరిచేసేందుకు శక్తినంతా ఉపయోగిస్తున్నాం... ఎంతచేసినా 11 ఏళ్ల తర్వాత కూడా ఇంకా మేము చేయాల్సింది చాలా ఉండిపోయిందని మోదీ అన్నారు. యూరియా రంగంలో స్వయం స్వావలంబన సాధించే దిశగా బలమైన అడుగులు పడుతున్నాయని... గోరఖ్‌పూర్, సింద్రీ, బరౌనీ, రామగుండం వంటి అనేక యూరియా ప్లాంట్లను తిరిగి ప్రారంభించామని తెలిపారు. అసోంలోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులు రావడం కాంగ్రెస్‌కు కావాలి. అసోం ప్రజల అస్తిత్వం, గౌరవంపై ఆందోళన లేదు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకుందని...అందుకోసమే ఓటర్ జాబితా సవరణను వ్యతిరేకిస్తోందని మోదీ ఆరోపించారు.

అసోం ప్రజల ఆత్మగౌరవానికి, గుర్తింపును, భూమిని కాపాడేందుకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని... అసోంను శక్తిమంతమైన రాష్ట్రంగా చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అసోం యువత కలలు నిజం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అంతకుముందు పశ్చిమ బొరగావ్‌లో స్వాహిద్ స్మారకాన్ని సందర్శించిన మోదీ... అసోం ఉద్యమంలో అమరులైన 860 మందికి నివాళులు అర్పించారు. అంతకుముందు బ్రహ్మపుత్ర నదిలో క్రూయిజ్‌లో మోదీ ప్రయాణించారు. క్రూయిజ్‌లోనే 'పరీక్షా పే చర్చ'లో భాగంగా ప్రతిభావంతులైన 25 మంది విద్యార్థులతో మాట్లాడారు.

కేంద్ర బడ్జెట్ ఆదివారమా?



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ 2026-27 కోసం సన్నాహాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఒక అసాధారణ పరిస్థితి తలెత్తింది. సాధారణ బడ్జెట్ సమర్పణ తేదీ అయిన ఫిబ్రవరి 1, 2026 ఆదివారం వస్తుంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం బడ్జెట్ తేదీని ఫిబ్రవరి చివరి నుంచి ఫిబ్రవరి 1కి 2017లో మార్చినప్పటి నుంచి ఈ పరిస్థితి ఇంతకు ముందు ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ప్రభుత్వం ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందా లేదా ప్రత్యామ్నాయ తేదీని ఎంచుకుంటుందా అనేది ఊహాగానాలకు దారితీసింది. అయితే ప్రభుత్వం ఫిబ్రవరి 1కే కట్టుబడి ఉండే అవకాశం ఉంది. ఒక ఆంగ్ల వార్తా పత్రిక కథనం ప్రకారం... ఫిబ్రవరి 1 సంప్రదాయాన్ని కొనసాగించడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. మరో అంశం ఏమిటంటే గురు రవిదాస్ జయంతి కూడా ఫిబ్రవరి 1, 2026న వస్తుంది. పార్లమెంటరీ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ తగిన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. కాగా, ప్రత్యేక పరిస్థితులలో గతంలో ఆదివారాల్లో పార్లమెంటు సమావేశమయింది. 2020లో కోవిడ్-19 మహమ్మారి సమయంలో, మే 13, 2012న పార్లమెంటు 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశాలు జరిగాయి. బుద్ధ పూర్ణిమ వంటి ప్రభుత్వ సెలవు దినాలలో కూడా సమావేశాలు జరిగాయి. అయితే సభ్యుల అభ్యంతరాల తర్వాత 1981, 1986లో గురు రవిదాస్ జయంతి నాడు సమావేశాలు రద్దు చేయబడినట్లు రాజ్యసభ రికార్డులు చూపిస్తున్నాయి.

హంపిలో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ముందస్తు 'చింతన్ శిబిరం'

కర్నాటక రాష్ట్రం హంపి సమీపంలోని మలపనగుడిలోని విజయశ్రీ హెరిటేజ్ రిసార్ట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నతాధికారులతో ఒక రోజు పాటు బడ్జెట్ ముందస్తు సమావేశం నిర్వహించారు. 'ప్రతి సంవత్సరం దేశంలోని వివిధ ప్రాంతాలలో బడ్జెట్‌కు ముందు చింతన్ శిబిరాలు నిర్వహించే సంప్రదాయాన్ని సీతారామన్ అనుసరిస్తున్నారు. ఈసారి ఆ అవకాశం హంపికి వచ్చింది. ఇది కొన్ని ఆశలను రేకెత్తించిందని ఒక ఉన్నతాధికారి చెప్పారు.

బంగ్లాదేశీగా పొరబడి వలస కార్మికుడిపై దాడి

తిరువనంతపురం: కేరళలో వలస కార్మికుడిని "బంగ్లాదేశ్ వ్యక్తి"గా పొరబడి దారుణంగా కొట్టి చంపిన సంఘటన వెలుగులోకి వచ్చింది. చత్తీస్‌గఢ్ శక్తి జిల్లాకు చెందిన 31 ఏళ్ల రామనారాయణ్ బఘేల్ (కేరళ)లో పనిచేస్తున్నాడు. బంగ్లాదేశీగా పొరబడిన కొందరు వ్యక్తులు అతడిని చావ చితకబాదారు. తీవ్రమైన గాయాలతో అతను మృతిచెందాడు. ఈ ఘటన పాలక్కాడ్ జిల్లాలో జరిగింది. డిసెంబర్ 17వ తేదీ సాయంత్రం, వలయార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అట్టపల్లం ప్రాంతంలో, స్థానిక నివాసితులు దొంగతనం చేశాడనే అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకుని అతని గుర్తింపు గురించి ప్రశ్నించారు. ఆ తర్వాత క్రూరంగా దాడి చేశారు. అయితే, అతడి వద్ద ఎలాంటి దొంగిలించిన వస్తువులు లభించలేదని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నివేదికలో రామ్‌నారాయణ్ శరీరంపై 80కి పైగా గాయాలు ఉన్నట్లు గుర్తించారు. తలపై బలమైన గాయాలు ఉన్నాయి. అతి ఛాతి నుంచి రక్తం కారుతున్నట్లు కనిపించిందని పోలీసులు తెలిపారు. దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ కేసులో అట్టపల్లం గ్రామానికి చెందిన మురళి, ప్రసాద్, అను, బిపిన్, ఆనందన్ అనే ఐదుగురు నిందితులను డిసెంబర్ 18న అరెస్ట్ చేశారు. విచారణలో రామనారాయణకు ఎలాంటి నేర చరిత్ర లేదని తేలిసింది. మృతుడికి ఎనిమిది, పదేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.

కిలోన్నర నిమ్మకాయ... 7 కిలోల సొరకాయ

భోపాల్: మధ్యప్రదేశ్ అటవీ శాఖ ఏర్పాటు చేసిన అటవీ ఉత్పత్తుల ప్రదర్శనలో ఆకర్షణీయమైన పండ్లు, కూరగాయలు ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఐదు అడుగుల పొడవున్న సొరకాయ, ఒకటిన్నర కేజీల నిమ్మకాయ, అంగుళం పరిమాణం గల నారింజ పండు, ఏడు కిలోల బరువున్న తెల్ల సొరకాయ, రకరకాల మొక్కలు, పండ్లు, చిరుధాన్యాలు సందర్శకులను ఆకర్షించాయి. ఆయుర్వేద ఔషధాలు, మూలికలు, గిరిజనులు తయారు చేసిన వస్తువులను కూడా ప్రదర్శించారు.

హదీని బంగ్లాదేశ్ మరువదు: యూనస్

ఢాకా: బంగ్లాదేశ్ రగిలిపోతోంది. ఇంక్విలాబ్ మంచో నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య ఆ దేశంలో ఉద్రిక్తతలను మళ్లీ పెంచింది. ఇదే క్రమంలో భారత హై కమిషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వీసా దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేశారు. చిత్తాగాంగ్‌లోని అసిస్టెంట్ హై కమిషన్ ఆఫ్ ఇండియా వద్ద అల్లర్ల క్రమంలో ఈ మేరకు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. హదీ అంత్యక్రియలకు వేలాది మంది హాజరయ్యారు. ఇందుకోసం భారీస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వాధినేత యూనస్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో హదీ పదిలమన్నారు. ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళతామని చెప్పారు. తుది వీడ్కోలు పలికేందుకు రాలేదు... బంగ్లాదేశ్ ఉన్నంత వరకు ఇక్కడి ప్రజల గుండెల్లో మీరు (హదీ) ఉంటారు. మీ మాట నెరవేరుస్తామని హామీనిస్తున్నా. బంగ్లాదేశ్ ప్రజలు మీ ఆదర్శాలను కొనసాగిస్తారు' అని యూనస్ తెలిపారు. ప్రపంచం ఎదుట బంగ్లాదేశ్ తలవంచదని తేల్చిచెప్పారు. షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది విద్యార్థుల ఆందోళనతో కుప్పకూలింది. ఈ ఆందోళనల్లో హదీ కీలక పాత్ర పోషించాడు. అయితే ఈనెల ఆరంభంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై దాడి చేశారు. చికిత్స పొందుతూ హదీ మరణించారు. దీంతో ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇది ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం కట్టుదిట్టమైన భద్రత నడుమ హదీ అంత్యక్రియలు జరిగాయి. కాగా, అల్లర్లలో భాగంగా ఓ ఇంటికి నిప్పు పెట్టగా ఏడేళ్ల చిన్నారి సజీవ దహనమైంది. అలాగే మూక హత్యకు గురైన హిందూ కుర్రాడి వ్యవహారంలో ఇప్పటివరకు 10 మంది అరెస్టయ్యారు. వీరిలో ఏడుగురిని రాపిడ్ యాక్షన్ బెటాలియన్ అదుపులోకి తీసుకోగా, మిగతా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా యూనస్ ఒక ప్రకటన చేశారు. అనేక చోట్ల తనిఖీలు జరిపి 19-46 మధ్య వయస్సు ఉన్న 10 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

న్యాయ పోరాటానికి సిద్ధం కండి

దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టండి: ఇమ్రాన్ ఖాన్



ఇస్లామాబాద్: తోషాఖానా అవినీతి కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీకి 17 ఏళ్ల శిక్ష విధిస్తూ తీర్పు వెలువడటం సంచలనంగా మారింది. ఇదే క్రమంలో దేశవ్యాప్త ఆందోళనలకు ఇమ్రాన్ పిలుపునిచ్చారు. న్యాయ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ జైల్లో ఉన్నారు. ఆయనకు 73 ఏళ్లు. మరో 17 ఏళ్ల శిక్ష అంటే ఇమ్రాన్ తన జీవిత కాలంలో జైలు నుంచి బయటకు రాలేరు. తాజా తీర్పు తర్వాత అడియాలా జైల్లో తన న్యాయవాదులతో ఇమ్రాన్ మాట్లాడారు. ఈ తీర్పును వ్యతిరేకించాలని, దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని తన మద్దతుదారులకు ఎక్స్ మాధ్యమంగా పిలుపునిచ్చారు. జైల్లో సామాజిక మాధ్యమాన్ని వినియోగించే అనుమతి లేని క్రమంలో న్యాయవాదులతో ఇమ్రాన్ సంభాషణను ఎవరూ పోస్టు చేశారన్నది చర్చకు దారితీసింది. కాగా, లాయర్లతో ఇమ్రాన్ ఇలా అన్నారు. 'వీధి పోరాటానికి సిద్ధం కావాలంటూ ఖైబర్ పక్తుంఖ్వా సీఎం సొహెయిల్ ఆఫ్రిదీకి సందేశం పంపాను. హక్కుల కోసం పోరాటంలో యావత్ దేశం పాల్గొనాలి. పోరాటం కూడా ఆరాధనే. పాకిస్థాన్‌కు నిజమైన స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం' అని ఇమ్రాన్ అన్నారు. ఇప్పుడు విధించిన శిక్ష తనకు ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించలేదని చెప్పారు. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేయాలని తన న్యాయ బృందానికి ఇమ్రాన్ ఖాన్ సూచించారు. గత మూడేళ్లుగా నిరాధార నిర్ణయాలు, శిక్షలు విధిస్తున్నట్లుగానే కొత్త శిక్ష విధించారని వాఖ్యానించారు. ఆధారాలు లేకుండా, న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా హడావిడిగా జడ్జి తీర్పు ఇచ్చారన్నారు.

న్యాయ పోరాటం పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ న్యాయవాదుల సంఘం ఇన్సాఫ్ లాయర్స్ ఫోరానికి అవసరమని ఇమ్రాన్ అన్నారు. న్యాయ వ్యవస్థ మాత్రమే ప్రజలను కాపాడగలదని, అది లేకపోతే ఆర్థిక పురోగతి, నైతికాభివృద్ధి అసాధ్యమని తెలిపారు. తన నిర్బంధాన్ని ప్రస్తావిస్తూ సైనిక ఉన్నతాధికారులను ఇమ్రాన్ నిందించారు. సైనికుల మద్దతు తనకున్నదన్నారు. ఏకాంతవాసంలో ఉంచుతూ తనను, తన భార్యను నిరంతరం మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. 'జైల్లో ప్రతి ఖైదీ టీవీ చూడొచ్చు కానీ నాకు, నా భార్యకు అందుకు అనుమతి లేదు. పుస్తకాలను, సమావేశాలను నిషేధించారు' అని ఇమ్రాన్ పేర్కొన్నారు.

అంధకారంలో శాన్ ఫ్రాన్సిస్కో

శాన్ ఫ్రాన్సిస్కో: శాన్ ఫ్రాన్సిస్కో అంధకారమైంది. 1,30,000 గృహాలు, వ్యాపారాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు పసిఫిక్ గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్ కో తెలిపింది. రిచ్మండ్, ప్రెసిడియో పరిసరాలు, గోల్డెన్ గేట్ పార్క్ చుట్టూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బ్లాక్‌అవుట్ కారణాలపై అధికారులు స్పందించలేదు. యుటిలిటీ కంపెనీ కస్టమర్లలో మూడింట ఒక వంతు మంది విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడ్డారు. రెస్టారెంట్లు, దుకాణాలను మూతబడ్డాయి. వీధులు చీకటయ్యాయి. ఈ పరిస్థితిపై శాన్ ఫ్రాన్సిస్కో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎక్స్ వేదికగా స్పందించింది. రవాణా అంతరాయాలు ఏర్పడ్డాయని, అనవసమైతేనే ప్రయాణాలు చేయాలని సూచించింది. విద్యుత్ లేక కొన్ని బస్సు, రైలు సేవలకు అంతరాయం కలిగినట్లు వెల్లడించింది. ఓ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరగడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగినట్లు వెల్లడించారు.

'బంగబంధు' హాలుకు హదీ పేరు

ఢాకా: ఢాకా విశ్వవిద్యాలయంలోని బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ హాల్ పేరు యువనేత షరీఫ్ ఉస్మాన్ హదీ హాలుగా మారింది. ఈ మేరకు బంగ్లాదేశ్ మీడియా ఆదివారం వెల్లడించింది. యూనివర్సిటీ ప్రధాన ద్వారా వద్ద నేమ్ ప్లేట్‌ను తొలగించి... షహీద్ షరీఫ్ ఉస్మాన్ హాది హాల్ అనే నేమ్ ప్లేట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. భవనంపై బంగబందు షేక్ ముజిబుర్ రెహాన్ చిత్రపటంపై విద్యార్థులు రంగు పూస్తున్న దృశ్యాలు వైరలయ్యాయి.

గజాలో కొరవడిన ఆహార భద్రత

80 శాతం జనాభాలో పౌష్టికాహార లోపం: ఐరాస

గజాసిటీ: గజాలో ఆహార భద్రత కొరవడింది. 80 శాతం మంది జనాభా పౌష్టికాహార లోపంతో భాధపడుతున్నారు. ఇజ్రాయిల్ ఆంక్షలతో ఈ సంక్షోభం మరింత ముదిరే ప్రమాదమున్నట్లు ఐక్య రాజ్య సమితి (ఐరాస) హెచ్చరించింది. 2026, అక్టోబర్ నాటికి లక్ష మందికి పైగా పిల్లలు తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడే అవకాశం ఉందని తెలిపింది. మానవతా సాయంపై ఇజ్రాయిల్ ఆంక్షలతో గజా పరిస్థితి మరింత క్షీణించినట్లు ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని నివారించడం కోసం మానవతా సాయాన్ని పెంచుకోవాలని యుఎన్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనా రెఫ్యూజీస్ ఇన్ ది నియర్ ఈస్ట్ కమిషనర్ జనరల్ ఫిలిప్ లాజారిని సూచించారు. సాయం కంటే అవసరాలు పెరుగుతున్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఇది ప్రస్తుత మానవతా సాయ అసమర్థతను ఎత్తి చూపుతోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత పంపిణీలో స్వల్ప మెరుగుదల ఉన్నప్పటికీ, నవంబరులో 67 శాతం గృహాలకు ఆహారం - రొట్టెలు అందాయని, ప్రాథమిక మనుగడ అవసరాలు మాత్రమే తీరే పరిస్థితి ఉన్నదని ఆయన వెల్లడించారు. గజా జనాభాలో పావు వంతు అంటే ఐదు లక్షల మంది కరువు పీడిత ప్రాంతాల్లో ఉన్నట్లు ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ క్లాసిఫికేషన్ (ఐపీసీ) ఆగస్టులో నివేదించింది. ఇజ్రాయిల్ మానవతా ఆంక్షలు, 7,30,000 మంది స్థానభ్రంశం, 96 శాతం వ్యవసాయ భూమి నాశనం కావడం వంటివి ఇందుకు దారితీసినట్లు వెల్లడించింది. వాణిజ్యం, సహకారం లేకపోతే కరువు శాశ్వతమవుతుందని ఐరాసతో పాటు స్వచ్ఛంధ సంస్థలు హెచ్చరికలు చేశాయి.





దిల్లీ వీధుల్లో 'పెద్ది'

హైదరాబాద్: భాషలకు అతీతంగా హీరో రామ్‌చరణ్ పెద్ది సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా నుంచి వచ్చిన ఏ అప్డేట్ అయిన సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా నుంచి మొదట విడుదలైన "చికిరి చికిరి" పాట రిలీజ్ అయిన వెంటనే సూపర్ హిట్ అయింది. ఈ పాట కేవలం 24 గంటల్లోనే 46 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సంపాదించి, ఈ సంవత్సరంలో అత్యధికంగా వీక్షించిన పాటలలో ఒకటిగా చరిత్ర సృష్టించింది. తాజాగా ఈ సినిమా సెట్ నుంచి ఫోటోలు బయటకొచ్చాయి. ఈ ఫోటోలలో హీరో రామ్ చరణ్ దిల్లీలో షూటింగ్ చేస్తున్నట్లు కనిపించారు. తాజాగా నెట్టింట వైరల్‌గా మారిన ఫోటోలతో ప్రేక్షకులలో పెద్ది సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం సినిమా షూటింగ్ నుంచి లీక్ అయిన రామ్ చరణ్ ఫోటోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నాయి. తాజాగా లీకైన ఫోటోలలో రామ్‌చరణ్ దిల్లీలోని రాష్ట్రపతి భవన్ సమీపంలో నడుస్తున్నట్లు కనిపించాడు. ఈసారి రామ్ చరణ్ వెండి తెరపై కొత్త అవతారంలో దర్శనమిస్తాడని ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ది సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తుండగా, మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ హీరోగా, జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతి బాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, పలువురు కీలక పాత్రలలో కనిపించనున్నారు.

26న నెట్‌ఫ్లిక్స్‌లో 'రివాల్వర్ రీటా'

హైదరాబాద్: జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటించిన తాజా యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రివాల్వర్ రీటా'. ఇటివల థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. జేకే చంద్రు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కీర్తి సురేష్ ఒక వైవిధ్య పాత్రలో కనిపించగా.. రాధిక శరత్ కుమార్, రెడిన్ కింగ్స్లీ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని 'మహారాజ' వంటి బ్లాక్ బస్టర్ నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ నిర్మించింది. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం డిసెంబర్ 26 నుండి స్ట్రీమింగ్ కానుంది. కేవలం తమిళం, తెలుగులోనే కాకుండా మలయాళం, కన్నడ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి రానుండటం విశేషం.

టీ20 జట్టు నుంచి తప్పించడంపై

గిల్ కు ముందే సమాచారం

ముంబై: టీమిండియా వన్డే జట్టు కెప్టెన్ శుభ్ మన్ గిల్ కు టీ20 వరల్డ్ కప్ జట్టులో చోటుదక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ విషయంలో గిల్ తో తాము టచ్ లో ఉన్నామని, టీ20 జట్టు కూర్పుపై ముందే ఫోన్ చేసి చెప్పామని బీసీసీఐ పేర్కొంది. ఇటీవలి దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ లో చివరి రెండు మ్యాచ్ లకు గిల్ అందుబాటులో లేడు. పేలవమైన ప్రదర్శనకు తోడు గాయం కారణంగా గిల్ ను తుది జట్టు నుంచి తప్పించారు. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్ కోసం బీసీసీఐ శనివారం జట్టును ప్రకటించింది. అదే సమయంలో అహ్మదాబాద్ నుంచి గిల్ చండీగఢ్ కు బయలుదేరాడు. జట్టులో కూర్పు, సమతూకం కోసం గిల్ ను పక్కన పెడుతున్నట్లు బీసీసీఐ వర్గాలు ఆయనకు ఫోన్ లో సమాచారం అందించారు. ఆసియాకప్ సందర్భంగా టీ20 జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన గిల్.. 15 మ్యాచ్ లు ఆడి కేవలం 291 పరుగులు మాత్రమే చేశాడు. టీ20 ఫార్మాట్ లో గిల్ స్ట్రైక్ రేట్ ఆశించిన స్థాయిలో లేదు. ఈ క్రమంలోనే సెలక్టర్లు అతడిని పక్కనపెట్టారు. టీ20 జట్టులో చోటు దక్కకపోవడంతో గిల్ ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ హజారే టోర్నమెంట్‌లో పంజాబ్ తరఫున ఆడనున్నాడు.

'అండర్-19 ఆసియాకప్' పాక్ వశం

ఫైనల్‌లో భారత్‌పై 191 పరుగుల భారీ విజయం

సెంచరీతో అదరగొట్టిన సమీర్

దుబాయ్: అండర్-19 ఆసియా కప్పును పాకిస్థాన్ జట్టు ఎగరేసుకుపోయింది. ఈ టోర్నీలో ఓటమెరగకుండా ఫైనల్‌కు చేరిన యువ భారత్ ఆఖరు మెట్టుపై బోల్తాపడింది. దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో 191 పరుగుల తేడాతో భారత్ ఓటమిపాలైంది. 26.2 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌటైంది. ఒక దశలో 120 పరుగులకే భారత్ తొమ్మిది వికెట్లు కోల్పోగా పదో స్థానంలో వచ్చిన దీపేశ్ దేవేంద్రన్ (36) పోరాటంతో స్కోరు 150 దాటింది. భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (26), ఖిలాన్ పటేల్ (19), ఆరోన్ జార్జ్ (16), అభిజ్ఞాన్ కుందు (13), వేదాంత్ త్రివేది (9), కాన్షిక్ చౌహాన్ (9), విహాన్ మల్హోత్రా (7), హెనిల్ పటేల్ (6), ఆయుష్ మాత్రే (2), కిషన్ కుమార్ సింగ్ (3లి) పరుగులు మాత్రమే చేశారు. పాక్ బౌలర్లలో అలీ రజా 4, మహ్మద్ సయామ్, అబ్దుల్ సుభాన్, హుజైఫా అహ్సన్ రెండేసి వికెట్లు పడగొట్టారు అంతకుముందు టాస్ గెల్చిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (172, 113 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సులు) భారీ శతకంతో విరుచుకుపడ్డాడు. అహ్మద్ హుస్సేన్ (56, 72 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. ఉస్మాన్ ఖాన్ (35), ఫర్హాన్ యూసుఫ్ (19), హంజా జహూర్ (18) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, హెనిల్ పటేల్ 2, ఖిలాన్ పటేల్ 2, కాన్షిక్ చౌహాన్ ఒక వికెట్ పడగొట్టారు. ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే హంజాను హెనిల్ పటేల్‌ను ఫెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత ఉస్మాన్ ఖాన్‌తో కలిసి సమీర్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీ 79 బంతుల్లో 92 పరుగులు జోడించింది. అనంతరం ఉస్మాన్‌ను ఖిలాన్ పటేల్ ఔట్ చేశాడు. ఆ తర్వాత అహ్మద్ హుస్సేన్‌తో జతకట్టిన సమీర్, నిలకడగా ఫోర్లు బాదాడు. 125 బంతుల్లో 137 పరుగులు చేసిన ఈ ద్వయంలోని హుస్సేన్‌ను ఖిలాన్ పటేల్‌ను వెనక్కి పంపాడు

. హుస్సేన్ ఔటైన తర్వాత మిన్హాస్ దూకుడు పెంచాడు. దీపేశ్ వేసిన 43 ఓవర్‌లో రెండు సిక్సులు, ఓ ఫోర్ బాదాడు. సమీర్ అదే ఓవర్‌లో భారీ షాట్ ఆడి కాన్షిక్ చౌహాన్‌కు చిక్కాడు. అప్పటికి పాక్ స్కోరు 302/4 కాగా, చివరి ఏడు ఓవర్లలో పాకిస్థాన్ 4 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది.

బాలీవుడ్ నటి

ఫతేహ్‌కు తప్పిన ప్రమాదం

ముంబై: బాలీవుడ్ నటి ప్రముఖ డ్యాన్సర్ నోరా ఫతేహ్‌కు పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ముంబైలో అమెరికన్ డీజే డేవిడ్ గెట్టా ఏర్పాటు చేసిన సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆమె ప్రయాణిస్తున్న కారును వేగంగా వచ్చిన మరో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు స్వల్పంగా గాయాలవగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కారు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ వినయ్ సక్పాల్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రతి సంవత్సరం గోవాలో జరిగే సన్బర్న్ ఫెస్టివల్ ఈసారి ముంబైలో జరుగుతోంది.

ఈ నెల 19న ఫెస్టివల్ ఘనంగా ప్రారంభించారు. నోరా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా అంబోలి లింక్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ సెక్షన్ల కింద డ్రైవర్ వినయ్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు ముంబై పోలీసులు మద్యం మత్తులోనే కారు నడిపి యాక్సిడెంట్ చేశాడని తెలిపారు. నటీ,సింగర్, డ్యాన్సర్ గా నోరా ఫతేహి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

'చాంపియన్' నుండి మరో పాట

హైదరాబాద్: శ్రీకాంత్ కుమారుడు రోషన్ హీరోగా నటించిన తాజా సినిమా చాంపియన్ క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుండగా తాజాగా 'ఐ యామ్ చాంపియన్'అంటూ సాగే టైటిల్ గేయాన్ని విడుదల చేశారు. ఇందులో ఒకప్పటి టాలీవుడ్ బాలనటి కనిపించడం విశేషం. ఈ చిత్రంలో రోషన్‌తో పాటు ఓ పాటలో కనిపించిన ఈ బాలనటి పేరు అవంతిక వందనపు. తెలుగు మూలాలున్నప్పటికీ అమెరికాలో పుట్టి పెరిగింది. మహేశ్ బాబు 'బ్రహ్మోత్సవం' మూవీతో బాలనటిగా పరిచయమైంది.

తర్వాత తెలుగులో ప్రేమం, ఆక్సిజన్, బాలకృష్ణుడు, మనమంతా, రారండోయ్ వేడుక చూద్దాం, అజ్ఞాతవాసి తదితర చిత్రాల్లో బాలనటిగా చేసింది. తర్వాత ఇంగ్లీష్‌లోనూ పలు సినిమాలు, సిరీస్‌లు చేసింది. మళ్లీ ఇప్పుడు చాన్నాళ్ల తర్వాత తెలుగులో 'చాంపియన్'లోని ప్రత్యేక పాటలో మెరిసింది. వైజయంతీ మూవీస్ నిర్మించిన 'చాంపియన్' చిత్రంతో మలయాళ బ్యూటీ అనస్వర రాజన్... టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. ప్రదీప్ అద్వైతం దర్శకుడు.

అడిలైడ్‌లోనూ ఆసీస్‌దే హవా

82 పరుగులతో ఇంగ్లాండ్‌పై గెలుపు

అడిలైడ్: యాషెస్ సిరీస్ 2025లో ఆస్ట్రేలియా వరుసగా మూడో టెస్టులోనూ విజయం సాధించింది. అడిలైడ్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్‌పై 82 పరుగుల తేడాతో విజయం సాధించింది. 435 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 352 పరుగులకే ఆలౌటైంది. జాక్ క్రాలీ (85 పరుగులు), జెమీ స్మిత్ (60 పరుగులు) అర్ధ శతకాలతో రాణించారు. చివర్లో విల్ జాక్స్ (41 పరుగులు), బ్రైండన్ కార్స్ (39 పరుగులు) పోరాడినా ఫలితం దక్కలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్ తలో 3, స్కాట్ బోలాండ్ ఒక వికెట్ పడగొట్టారు. ఇంగ్లాండ్ ప్రారంభంలోనే బెన్ డకెట్ (4) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఒలీ పోప్ (17) కూడా నిరాశ పర్చాడు. అయితే జో రూట్ (39 పరుగులు, 63 బంతులు) కాస్త కుదురుకున్నట్లే కనిపించినా, అతడిని కమిన్స్ పెవిలియన్‌కు పంపాడు. హ్యారీ బ్రూక్ (30), బెన్ స్టోక్స్ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో ఇంగ్లాండ్ కష్టాల్లో పడింది.

ఈ సమయంలో జెమీ స్మిత్, విల్ జాక్స్ క్రీజులో నిలబడ్డారు. దీంతో ఇంగ్లాండ్ విజయంపై ఆశలు కలిగాయి. కానీ చివర్లో మళ్లీ పట్టు బిగించిన ఆసీస్ వరుస వికెట్లు కూల్చి విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (107 పరుగులు), రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీ (72 పరుగులు)తో రాణించిన ఆసీస్ బ్యాటర్ అలెక్స్ కేరీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (170 పరుగులు) భారీ సెంచరీతో అదరగొట్టడడంతో ఆసీస్ ప్రత్యర్థి ముంగిట భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. ఇక ఇరుజట్ల మధ్య నాలుగో టెస్టు మెల్‌బోర్న్ వేదికగా డిసెంబర్ 26న ప్రారంభం కానుంది.

ప్రాచీన వైద్యానికి 'ఆయుష్'!

- గ్లోబల్ స్థాయిలో ప్రోత్సాహానికి కృషి
- గత ప్రభుత్వ విధానాలతో నిర్లక్ష్యం
- అధికారుల్లో నిర్లిప్తత... అనర్హులు వైద్యులుగా చెలామణి

విశాలాంధ్ర-సచివాలయం: ఆయుష్‌కు పునరుజ్జీవం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆయుర్వేద, యోగా, హోమియోపతి, యునాని ఆసుపత్రుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో మూడు ఆయుష్ ఆస్పత్రులు, ఒక ఆయుర్వేద బోధనా ఆస్పత్రి, రెండు మినీ ఆయుర్వేద ఆస్పత్రులు, మూడు హోమియో బోధనా ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. ఆయుర్వేద, యోగా, హోమియోపతి, ఆయుష్ వైద్యానికి ప్రాముఖ్యత పెరిగింది. 46 దేశాల్లో ఈ వైద్య విధానాన్ని పాటిస్తున్నారు. అంటే మన సాంప్రదాయ వైద్యానికి ఎంతటి గుర్తింపు ఉందో అర్థమవుతోంది. భారతీయ సంప్రదాయ వైద్యమైన ఆయుర్వేద, యోగా, నేచురోపతిని ప్రపంచమంతా అనుసరిస్తున్న సమయంలో గత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ఆయుష్ పూర్తి నిర్లక్ష్యానికి గురయింది. వివిధ ప్రాంతాల్లో నిధుల కొరత కారణంగా ఆయుష్ డిస్పెన్సరీలు మూతపడ్డాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు ఈ శాఖపై సమీక్షలు నిర్వహించి సంప్రదాయ వైద్య పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. ఆయుష్ విభాగానికి గత ఐదేళ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిన నిధులు కేవలం రూ.71 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.28 కోట్లు శాప్ కింద కేంద్రం నుంచి తీసుకొచ్చారు. కాకినాడలో రూ.7.2 కోట్లతో 60 బెడ్ల సామర్థ్యం ఉన్న ఆస్పత్రిని, విశాఖలో రూ.8.3 కోట్ల వ్యయంతో 80 బెడ్ల సామర్థ్యం కలిగిన ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ ఆయుష్ మిషన్ నిధులతో 126 ఆయుష్ డిస్పెన్సరీలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం అవి ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాలుగా సేవలందిస్తున్నాయి. మొత్తంగా ప్రాచీన సంప్రదాయ వైద్యానికి ఆయుష్ పోసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుర్వేదాన్ని గ్లోబల్ స్థాయిలో ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న సమయంలో, ఆయుర్వేదం పేరుతో రాష్ట్రంలో అర్హత లేని వ్యక్తులు, నకిలీ వైద్యులు, నకిలీ మందులు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆయుర్వేదం పేరుతో చట్టబద్ధమైన విద్యా అర్హతలు లేకుండా వైద్యం చేయడం, నకిలీ సర్టిఫికెట్లతో క్లినిక్స్ నిర్వహించడం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్‌కు విరుద్ధంగా నకిలీ ఆయుర్వేద మందులు తయారు చేసి విక్రయిస్తున్నారనేది బహిరంగ రహస్యం. దీనివలన ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతో పాటు ఆయుర్వేదంపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతోంది. చట్టబద్ధమైన అర్హతలు లేకుండా కొందరు నకిలీ ఆయుర్వేద వైద్యులుగా ప్రచారం చేసుకుంటూ, వైద్యంతో పాటు అనుమతి లేని మందులు తయారు చేయడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో కొంతమంది అర్హతలు లేని వ్యక్తులు, ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా అనుమతి లేని మందుల తయారీ యూనిట్లు నడుపుతూ, ఆయుర్వేద వైద్యులు పేరుతో ప్రజలను మోసగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నకిలీ ఆయుర్వేద వైద్యులు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆయుర్వేద వైద్యం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఆసరగా తీసుకున్న కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ఆయుర్వేద డిస్పెన్సరీలు ప్రారంభించి వైద్యం మొదలెట్టేశారు. రోగం నయం అవుతుందన్న ఆశతో అమాయక ప్రజలు నకిలీ ఆయుర్వేద ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో నాలుగు వేల మంది నకిలీ ఆయుర్వేద వైద్యులు ఉన్నట్లు అంచనా. ఆయుర్వేద బోర్డ్‌లో రిజిస్ట్రేషన్ కి అర్హత లేనప్పటికీ ఆయుర్వేద వైద్యుల్లా చెలామణి అవుతున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ ఆయుష్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయుర్వేదంలో నకిలీ వైద్యులు, మందుల్ని కట్టడి చేసేందుకు ఆరోగ్యశాఖ, ఆయుష్, పోలీస్, డ్రగ్ కంట్రోల్ అధికారులతో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలని పలువురు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అర్హతలేని వైద్యుల క్లినిక్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే వాస్తవాలు నిగ్గుతేలతాయంటున్నారు.

అమరావతిలో రూ.100 కోట్లతో పరిశోధనా కేంద్రం

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయుర్వేద విశ్వవిద్యాలయం స్థాయిలోనే 2018లో కేంద్రం... ఆంధ్రప్రదేశ్‌కు యోగ, నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసింది. ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు ఎన్డీయే ప్రభుత్వం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం కొండపావులూరులో 25 ఎకరాల భూమిని కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసి ఆ 25 ఎకరాల స్థలాన్ని జగనన్న కాలనీ కోసం కేటాయించింది. ప్రస్తుతం ఈ యోగా నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని రూ.100 కోట్లతో రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అభ్యుదయ సాహిత్యం గురజాడతో ప్రారంభం

పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-కర్నూలు: తెలుగు సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యం గురజాడతో ప్రారంభమైందని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఎస్టీయూ భవన్‌లో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 90 ఏళ్ల తెలుగు అభ్యుదయ సాహిత్యం సదస్సులో లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'భావ కవిత్వం వచ్చి గురజాడ మార్గాన్ని అపమార్గం పట్టించింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి సారధ్యంలో ఈ భావ కవిత్వ ధోరణి 1931 నాటికే కనుమరుగైంది. శ్రీశ్రీ 1933లో రాసిన జయభేరి కవితతో తెలుగునాట అభ్యుదయ సాహిత్యం ప్రారంభమైంది. ఆనాటి నుంచి అభ్యుదయ సాహిత్య ఉద్యమం అవిఛిన్నంగా సజీవ ప్రవంతిలా సాగుతుంది' అని అన్నారు. అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి ఈ ఏడాదికి 90 సంవత్సరాలు అయినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. కర్నూలులో కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో అరసం కర్నూలు జిల్లా శాఖ సాహిత్య సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యం, మార్క్సిజం తాత్విక దృక్పథంతో వర్గ సంఘర్షణలు ప్రతిబింబిస్తుందని పీడిత, కర్షక, కార్మిక జీవితాలను చిత్రిస్తోందన్నారు. అస్తిత్వవాదాలను ఆలింగనం చేసుకుంటుందని, ప్రపంచీకరణను ప్రతిఘటిస్తుందని అన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రచయిత ప్రజా సాహిత్యాన్ని విరివిగా వెలువరించాలని కోరారు. తెలంగాణ విమోచన ఉద్యమం సాహిత్యం అనే అంశంపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ,అభ్యుదయ సాహిత్య విమర్శ అంశంపై ఆచార్య కరిమిండ్ల లావణ్య, అభ్యుదయ నవల అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త కేపీ అశోక్ కుమార్, అభ్యుదయ కథ అనే అంశంపై డాక్టర్ ఎం హరి కిషన్, అభ్యుదయ నాటకం అనే అంశంపై డాక్టర్ వింధ్యవాసినీ దేవి, అభ్యుదయ కవిత్వం అంశంపై కెంగార తాయప్ప పత్ర సమర్పణం చేశారు. సాహిత్య అకాడమీ తరపున చంద్రశేఖర రాజు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఉపాధ్యక్షులు పుల్లా రామాంజనేయులు, సయ్యద్ జహీర్ అహ్మద్, మానస, కేసి మల్లికార్జున, దాసరి వెంకటరమణ, వెంకట రాముడు, నగర ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి పాల్గొన్నారు. అనంతరం అతిథులను, ప్రధాన వక్తలను అరసం శాఖ తరపున సన్మానించారు.

కోర్టు విచారణ సామాన్యులకు సైతం అర్థం కావాలి

- తీర్పుల్లో నిబద్ధత ఉండాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ మూల స్థంభం అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. చినకాకానిలోని ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీలో "రాజ్యాంగ దృక్కోణం-జిల్లా న్యాయ వ్యవస్థ పాత్ర" అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే భారత న్యాయ వ్యవస్థ అతి పెద్దదని...అనేక దేశాల రాజ్యాంగాల కంటే ఉత్తమ లక్షణాలు కలిగి ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ప్రతి అంశంలో రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా, స్థైర్యంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగంలో జిల్లా న్యాయ వ్యవస్థకు ఉత్తమ స్థానం కల్పించడం జరిగిందన్నారు. ఉత్తమ న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన విధిగా గుర్తించాలని సూచించారు. సామాన్యునికి న్యాయం చేరువ కావడం న్యాయ వ్యవస్థ పనితీరు మీద ఆధారపడి ఉంటుందని తెలిపారు. న్యాయస్థానంలో జరిగే విచారణ సామాన్యునికి సైతం అర్థం కావాలని, అప్పుడే న్యాయ వ్యవస్థపై విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని చెప్పారు. న్యాయ వ్యవస్థ చట్టానికి, గౌరవానికి వారధిగా పనిచేయాలని అందుకు న్యాయమూర్తులుగా విలువలు, బాధ్యతలు పాటించాలని, మంచి క్రమ శిక్షణ, న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఉద్బోధించారు. పోటీతత్వంలో విజయం సాధించే దిశగా ప్రతి న్యాయమూర్తి తయారు కావాలని, రోజు రోజుకు పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అన్నారు. రాజ్యాంగ విలువలు కాపాడటం ఒకటే విధులలో భాగం కాదని, ప్రతి అంశాన్ని స్పృశించడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రస్తుత విధులు నిర్వహణతో పాటు పాత రికార్డులు చదవడం ద్వారాను అపారమైన అవగాహన కలుగుతుందని అన్నారు. తీర్పులు ఇవ్వడం ఒక్కటే న్యాయ వ్యవస్థ ప్రక్రియ కాదని, ఆ తీర్పులో నిబద్ధత ఉండాలన్నారు. తీర్పు ఇవ్వడంలో న్యాయమూర్తి ప్రవర్తన అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. రాజ్యాంగం సూచించిన మార్గదర్శకాలలో శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వహణ వ్యవస్థ నడవాలని, అది కేవలం న్యాయపరమైన డాక్యుమెంట్ మాత్రమే కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. ఇందులో జిల్లా న్యాయ వ్యవస్థకు సముచిత స్థానం ఉందని, ప్రతి వ్యక్తి మొదటగా జిల్లా న్యాయ వ్యవస్థ వద్దకు మాత్రమే వస్తారని అన్నారు. అనేక తీర్పులు పౌరుల నమ్మకం, విశ్వాసం చూరగొన్నాయని న్యాయమూర్తి చెప్పారు. కేసుల విచారణ చాలా దశల్లో జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల హక్కులు కాపాడాలని, సాంకేతికత ఎంత వచ్చినప్పటికీ న్యాయం అనేది మానవతా దృక్పథంపై ఆధారపడిందని అన్నారు. అత్యుత్తమ తీర్పులు (ల్యాండ్ మార్క్ జడ్జిమెంట్) ఇవ్వడం ఒక్కటే పనితీరుకు నిదర్శనం కాదని, రోజువారి వ్యవహారాలను నిబద్ధతతో, పౌరుల నమ్మకం మేరకు పరిష్కరించడంలో ఉన్న సంతృప్తి గొప్పదని వివరించారు. ఇచ్చే తీర్పులు ప్రజలను ఆకర్షించకపోవచ్చని, కానీ ఒక వ్యక్తికి గొప్ప ఉపశమనం కలిగించవచ్చని అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ న్యాయమూర్తి ప్రశాంతత, నిగ్రహం, ఓపిక, స్థైర్యంతో వ్యవహరించాలని అప్పుడే నిజాయితీ, నిష్పక్షపాత తీర్పులు ఇవ్వగలరన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ పాట్రన్ ఆఫ్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్థలోకే ముఖ్యమైనదని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, చింతలపూడి పురుషోత్తం కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న న్యాయ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జీవితాలతో చెలగాటం!

- ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ నిర్వాకం
- కేసు నమోదులో పోలీసుల తాత్సారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం


DISTRICT SPORTS AUTHORITY
IGMC STADIUM, LABBIPET, VIJAYAWADA.
Ph: Email:
Lr.No.DSA/Legal/ /2025. Date: /11/2025
To
The Circle Inspector,
Machavaram Police Station,
Vijayawada, NTR District.
Sir/Madam,
I here with giving complaint on Fencing.Association is involved in issuing fraud or fake certificates. These certificates are being provided to individual with out proper guidelines and competitions, proper trails for assessment or adhering to the normore and standers set by recognized sports federations/governing body.
Status of Association:
- Misrepresentation of achievement
- Unfair selections.
- Compromised integrity of sports arena/events.

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: క్రీడాకారుల జీవితాలతో ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ చెలగాటం ఆడుతోంది. అసోసియేషన్ గుర్తింపును స్పోర్ట్స్ అథారిటీ రద్దు చేసినాగానీ మోసాలు కనొసాగిస్తోంది. అనుబంధ జిల్లా అసోసియేషన్లతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా టోర్నమెంట్లను అనధికారికంగా నిర్వహిస్తోంది. గుర్తింపు రద్దు కాక ముందు తేదీలతో సరిఫికెట్లు ఇస్తోంది. నకిలీ పత్రాలు సైతం జారీ చేస్తోంది. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) అంతర్గత విచారణలో తేలింది. దీంతో విజయవాడ, మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఈనెల 8వ తేదీన శాప్ తరఫున ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఫోర్జరీ సర్టిఫికెట్లు ప్రదానం చేసిన బాధ్యులను విచారణకు పిలవలేదు. ఈ వ్యవహారంలో పోలీసులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపును 2024 జనవరిలో శాప్ రద్దు చేసినప్పటికీ రాష్ట్ర, జిల్లా స్థాయి టోర్నమెంట్లు నిర్వహిస్తూ విజేతలకు పత్రాలు, పతకాలను అసోసియేషన్ ప్రదానం చేస్తోంది. అవి చెల్లని సర్టిఫికెట్లు అని గ్రహించిన కొందరు క్రీడాకారుల తల్లిదండ్రులు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ, నంద్యాలతోపాటు అనేక జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో అర్జీలు పెట్టుకున్నారు.క్రీడాకారులను మోసం చేస్తున్న అసోసియేషన్‌పై చర్యలను కోరారు. విజయవాడకు చెందిన ఓ క్రీడాకారుడి తండ్రి కూడా ప్రైవేట్ కేసు పెట్టారు. హైకోర్టును ఆశ్రయించారు. దీంతో శాప్ అప్రమత్తమైంది. వెంటనే విచారణ నిర్వహించింది. పాత తేదీతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్యం సాధించినట్లు ఒకరికి నకిలీ పత్రం ఇచ్చినట్లు శాప్ అధికారులు గుర్తించారు. జూన్‌లో విజయవాడలో జరిగిన సీనియర్ మెన్ అండ్ ఉమన్ నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని రజకం సాధించినట్లు సీరియల్ నంబర్ లేకుండా నకిలీ సర్టిఫికెట్‌ను మరో అమ్మాయికి ఇచ్చినట్లు తేల్చింది. విజయవాడ మాచవరం పోలీసులకు ఫిర్యాదు అందినప్పటికీ కేసు నమోదు చేసి విచారణ చేయకుండా తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, ఫోర్జరీ సర్టిఫికెట్లు పొందిన వారు స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యలో సీట్లు పొందారని, తద్వారా అసలైన క్రీడాకారులు నష్టపోతున్నారని ఆయా క్రీడాకారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విజయవాడలో ఒక క్రీడాకారుడి తండ్రి ఫిర్యాదు చేసేందుకు అన్ని ఆధారాలతో పోలీస్ స్టేషన్‌కు వెళితే... ఆయనతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ చాలా చులకనగా మాట్లాడినట్లు తెలిసింది. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విజయవాడ సీపీకి ఫిర్యాదు చేయగా, సంబంధిత ఏరియా స్టేషన్‌కు పిటిషన్ పంపారు. ఫిర్యాది అందుబాటులో లేని సమయంలో ఫోన్ చేసి రావాలని కోరగా, ఆయన వెళ్లలేదు. దీంతో ఫిర్యాదుదారుడు సహకరించలేదని పిటిషన్ మూసివేసినట్లు తెలిసింది. కొందరు ఫోన్ చేసి ఆయనను బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో బాధితుడు సోమవారం మరోసారి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఆ వార్తలు అవాస్తవం

బంగ్లా హైకమిషన్ వద్ద నిరసనలపై విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వెలుపల జరిగిన నిరసనల్లో ఎటువంటి భద్రతా లోపం తలెత్తలేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. బంగ్లాదేశ్ హైకమిషన్ బయట ఉన్న కంచెలను ఆందోళనకారులు ధ్వంసం చేసి, లోపలికి చొరబడడానికి ప్రయత్నాలు చేసినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తమని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా అక్కడి మీడియా అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. బంగ్లా హైకమిషన్ వద్ద ఎవరూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదన్నారు. బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్ అనే మైనారిటీ యువకుడి హత్యకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ముందు దాదాపు 20-25 మంది యువకులు గుమిగూడి శాంతియుతంగా నినాదాలు చేసినట్లు రణధీర్ పేర్కొన్నారు. కొన్ని నిమిషాల తర్వాత అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వారిని చెదరగొట్టారన్నారు. అయితే వారు అక్కడి నిబంధనలు ఉల్లంఘించడానికి, కంచెను దాటడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సైన్యం చేతికి ఆత్మాహుతి డ్రోన్లు

త్వరలో రక్షణశాఖ తుది నిర్ణయం

న్యూఢిల్లీ: భారత సైన్యానికి మరిన్ని అధునాతన సాంకేతిక ఆయుధాలు అందనున్నాయి. 850 ఆత్మాహుతి డ్రోన్ల (కాముకాజి) కొనుగోలు ప్రక్రియ తుదిదశలో ఉంది. ఈ నెలాఖరున జరిగే రక్షణ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో... సాంకేతికను అందిపుచ్చుకుంటూ ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. సైన్యంలోనే కాకుండా నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోనూ ఈ తరహా డ్రోన్ల వాడకాన్ని మరింత పెంచుకోవాలన్న లక్ష్యంతో మొత్తం 30 వేల డ్రోన్లను సమకూర్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే తొలి విడతగా 850 డ్రోన్ల కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఆత్మాహుతి డ్రోన్లను నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ (ఎన్ఏఎల్) అభివృద్ధి చేస్తోంది. వెయ్యి కిలోమీటర్ల దాకా ఎగరగలవు. రాడార్ల కళ్లుగప్పి.. లక్ష్యాలను ఛేదించగలవు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇలాంటి డ్రోన్లను వినియోగిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, దాని మిత్రదేశాల నౌకా దళాలపై దాడులకు జపాన్ తన యుద్ధవిమానాలను ఆత్మాహుతి దాడులకు ఉపయోగించింది. వారిని కాముకాజి ఆత్మాహుతి దళాలుగా పిలిచేవారు.

వాడవాడలా జగన్ పుట్టిన రోజు వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆయా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పార్టీ కేంద్రాలలో కేక్‌లు కట్ చేసి వైసీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. రక్తదానం తదితర సేవా కార్యక్రమాలను చేపట్టారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకలో ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జనత తలరాతలు మార్చే గొప్ప పాలన అందించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీ ఓడిపోయినా ఆయనకు ఏమాత్రం ప్రజాదరణ తగ్గలేదని స్పష్టం చేశారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ నేతలతోకలిసి సజ్జల పూలమాలలేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులతో కలిసి భారీ కేకును కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. వేడుకల అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సజ్జల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, కల్పలతారెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గౌతంరెడ్డి, పార్టీ బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు కొండమడుగుల సుధాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి, షేక్ ఆసిఫ్, గాదిరాజు సుబ్బరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు చంద్రబాబు, పవన్, షర్మిల శుభాకాంక్షలు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రబాబు తన ట్వీట్‌లో 'శ్రీ వైఎస్ జగన్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన దీర్ఘాయుష్యుతో, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా సామాజిక మాధ్యమ వేదికగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 'వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంతోషాలు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలానే జగన్‌కు ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటూ ఆమె తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

వ్యాలిడేషన్ చట్టం రద్దు చేయాలి

- దేశ వ్యాప్త జనజాగరణ ఉద్యమానికి సన్నద్ధం
- అఖిల భారత స్టేట్ పెన్షనర్ల సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పెన్షనర్ల ప్రయోజనాలను వ్యతిరేకంగా పార్లమెంట్ ఆమోదించిన వ్యాలిడేషన్ చట్టాన్ని చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ (న్యూఢిల్లీ) కోర్ కమిటీ సమావేశం ఆదివారం చైర్మన్ పీకే శర్మ అధ్యక్షతన విజయవాడ హోటల్ ఐలాపురంలో జరిగింది. ఈ ఏడాది మార్చి 25వ తేదీన కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా వాలిడేషన్ చట్టాన్ని ఆమోదించుకుందని, ఆ చట్టం వల్ల భవిష్యత్తులో 2026 జనవరి 1వ తేదీ తర్వాత పదవీ విరమణ చేయబోతున్న ఏ ప్రభుత్వ పెన్షనరు వేతన సవరణ కమిషన్ సిఫార్సుల ప్రయోజనాన్ని పొందే అవకాశాన్ని కోల్పోతారు అని ఫెడరేషన్ ప్రతినిధులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని సత్వరమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఆందోళనకు సిద్ధపడుతున్నామని హెచ్చరించారు. ఈ చట్టం వలన సంభవించబోయే దుష్పరిణామాలని పెన్షనర్లకు, ఉద్యోగులకు, ప్రజలకు వివరించడానికి అలాగే వారిలో ఉద్యమస్ఫూర్తిని నింపడానికి త్వరలో "జన జాగరణ ఉద్యమాన్ని" దేశవ్యాప్తంగా ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమం వివరాలను ఖాయపరచుకోవడానికి రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో కౌన్సిల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఎటువంటి కార్యాచరణకైనా సిద్ధమని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చీకటి ఉత్తర్వులు తీసుకురావడం దుర్మార్గమన్నారు. భవిష్యత్ తరాలకు ఇలాంటి చట్టాల వలన తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీపీఎస్/ఓపీఎస్ ఉద్యోగులను వేరు చేసినట్లే, ఇప్పుడు ఓ పిఎస్ పెన్షనర్లను విడగొట్టి, భవిష్యత్‌లో సెంట్రల్ / రాష్ట్ర పే కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా ఉండేందుకు కుట్ర పన్నారని, దీనిని తిప్పికొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఐక్య ఉద్యమాలు చేసేందుకు అందరం ఏకం అవ్వాలని, దానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ జేఏసీ అమరావతిలోని అన్ని సభ్య సంఘాలు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్లమెంట్/రాష్ట్ర అసెంబ్లీలకు ఎంపికయ్యే ప్రజా ప్రతినిధులకు పూర్తి స్థాయిలో ఎన్ని సార్లు పదవి చేస్తే అన్ని సార్లు పెన్షన్ పొందే సౌకర్యం ఉన్నప్పుడు, సుమారు 35/40 సంవత్సరాలు పాటు సుదీర్ఘంగా ప్రభుత్వానికి సేవ చేసే ప్రభుత్వ ఉద్యోగులకు/ పెన్షనర్లకు పెన్షన్ ఇచ్చేందుకు ఎందుకు వెనకడుతున్నారని బొప్పరాజు ప్రశ్నించారు. ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ కేంద్ర సంఘం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర సంఘంగా కట్టుబడి ఉంటామని, ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఇచ్చే ఎటువంటి కార్యాచరణ అయిన అమలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. "పెన్షనర్స్ వాయిస్" పత్రిక చీఫ్ ఎడిటర్ ఎస్ ఎస్ దూబే, సెక్రటరీ జనరల్ డి.సుధాకర్, మాజీ ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షులు జి.పి.రావు, ఏపీ జేఏసీ ఆర్థిక కార్యదర్శి ఏ.రాజేంద్ర బాబు, కార్యదర్శి ఎం సి లింగన్న, పెన్షనర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లవ కుమార్, ఏపీ పోలీసు అధికారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాస రావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి, ఆర్థిక కార్యదర్శి నాగరాజు ఏపీ పెన్షనర్స్ షెడ్యూల్డ్ జనరల్ సెక్రెటరీ బుచ్చిరాజు, ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి వైఎస్ రావు, సిటీ జేఏసీ చైర్మన్ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదం బీజేపీకి చేదు పదం

దానిని రాజ్యాంగం నుంచి తొలగించే ప్రయత్నం: సీఎం ఎం.కె.స్టాలిన్

తిరునల్వేలి (తమిళనాడు): బీజేపీ లౌకికవాద భావననే ద్వేషిస్తుందని, దానిని రాజ్యాంగం నుంచి తొలగించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. శనివారం ఇక్కడ జరిగిన క్రిస్మస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్టాలిన్, దక్షిణ తమిళనాడులోని తిరునెల్వేలి మహిళలకు విద్యను అందించడంలో 19వ శతాబ్దం ప్రారంభంలో క్రైస్తవ మిషనరీ సారా టక్కర్ చేసిన గొప్ప సేవలను ప్రశంసిం చారు. క్రిస్మస్ అనేది శాంతి వైపు మార్గనిర్దేశం చేసే పండుగ అని అన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు సోదరుల వలె జీవించాలని కోరారు. ద్రవిడ మున్నేట్ర కజగం అనేది మైనారిటీల సంక్షేమం కోసం నిజంగా శ్రద్ధ వహించే ఉద్యమమని అన్నారు. డీఎంకే నేతృత్వంలోని పాలనలో అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేయడం జరిగిందని, మైనారిటీల సంక్షేమ పరిరక్షణకు ఇది ఒక వాస్తవిక స్వర్ణయుగమని అన్నారు. మైనారిటీ విద్యా సంస్థల ఉపాధ్యాయ ఎంపిక కమిటీలలో, ఆయా సంస్థల ప్రతినిధులు మాత్రమే ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారని, దానిని సులభతరం చేసే జీవోపై సంతకం చేసిన తర్వాతే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని సీఎం అన్నారు. తన ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చిందని, మత వివక్ష లేకుండా అందరికీ పునరుద్ధరణ, సంబంధిత పనులను చేపట్టింద న్నారు. అందువల్ల తమిళనాడు ప్రజలు తమ పాలనకు పూర్తిగా మద్దతు ఇస్తుండటం కొంతమందిని చికాకుపెడుతోందని తెలిపారు.

ఎరుపెక్కిన పుదుచ్చేరి

పుదుచ్చేరి: భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది వేడుక పుదుచ్చేరిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించగా, నాయకులతో పాటు వందల సంఖ్యలో పార్టీ అభిమానాలు హాజరయ్యారు. సీపీఐ కార్యదర్శి అనీరాజా, పుదుచ్చేరి కార్యదర్శి ఏఎం సలీంతో పాటు అనేక మంది నాయకులు ప్రసంగించారు. పుదుచ్చేరిలో సీపీఐ ఘన చరిత్రను నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఫ్రెంచ్ వలసవాద పాలన నుంచి నేటి వరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు జరిగాయని తెలిపారు. కార్మిక హక్కులు, సామాజిక న్యాయం కోసం సీపీఐ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. శ్రామిక వర్గ ప్రయోజనాలు, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు సీపీఐ కట్టుబడి ఉందని అన్నారు. సీపీఐకి లభిస్తున్న ఆదరణ దాని ఘన చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యమని వక్కాణించారు. ఎర్ర జెండా ఎప్పుడు ప్రజల పక్షాన్నే నిలుస్తుందని, అగ్రభాగాన నిలిచి వారి హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీకి గణనీయమైన తోడ్పాటు అందించిన సీనియర్లను అనీరాజా శాలువా కప్పి సత్కరించారు.

నక్సలిజం ముసుగులో గిరిజనుల హత్య

కేంద్రం ఆదేశాలు పాటిస్తున్న ఎన్నికల సంఘం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

పట్నా: నక్సలిజంపై పోరు నెపంతో గిరిజనులను చంపేస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. యాంటీ నక్సల్ ఆపరేషన్ల పేరిట ఆదివాసీలపై హింసను పాలకులు సమర్థించుకుంటున్నారని దుయ్యబట్టారు. బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా అమాయక గిరిజనులను హతమారుస్తున్నారని, అంతర్గత భద్రత ముసుగులో మారణహోమాన్ని సమర్థించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. బీహార్ రాజధాని పట్నాలో రెండు రోజుల పాటు జరిగిన పార్టీ సమావేశాల్లో భాగంగా దేశ భద్రతా విధానాలతో పాటు ఎన్నికల కమిషన్ పనితీరును డి.రాజా విమర్శించారు. నక్సలిజం అంతమే లక్ష్యమని చెప్పుకుంటూ గిరిజనులపై దురాగతాలను సర్కారు సాగిస్తోందన్నారు. సంస్థాగత వేధింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారి చెప్పుచేతుల్లోకి ఎన్నికల సంఘం వెళ్లిందని దుయ్యబట్టారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్వహించినప్పుడు... అసోంలో ఎందుకు చేపట్టలేదని డి.రాజా ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎస్ఐఆర్ జరుగుతోందని వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నడుచుకుంటోందని, అధికారంలో ఉన్న వారు ఆడించినట్లు ఆడే కీలుబొమ్మగా రాజ్యాంగబద్ధ వ్యవస్థ మారిందని అన్నారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో రాజకీయ లబ్ధికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టేస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలని రాజా పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శులు గిరీశ్ చంద్ర శర్మ, రామకృష్ణ పాండా, అనీరాజా కూడా ప్రసంగించారు. ఈనెల 26న బీహార్‌లో సీపీఐ శతాబ్ది వేడుక ఘనంగా నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో భాగంగా 11 మందితో నూతన రాష్ట్ర కార్యదర్శివర్గం, 31 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీహార్‌లో పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవడమే కాకుండా, క్షేత్రస్థాయి నుంచి రాజకీయ పోరాటాలను తీవ్రతరం చేసేందుకు పునర్వ్యవస్థీకరణ అవసరమని సీపీఐ నాయకులు వెల్లడించారు.

'నల్లూరి' యువతరానికి మార్గదర్శి

రావుల వెంకయ్య

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రకాశం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రముఖ కమ్యూనిస్టు నేత నల్లూరి అంజయ్య... యువతరానికి మార్గదర్శి అని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య అన్నారు. కొత్తపల్లి పంచాయతీ మారెళ్ళగుంటపాలెం పొత్తూరి సుబ్బమ్మ పేరయ్య కమ్యూనిటీ హాల్లో ఆదివారం సీపీఐ శతవసంతాలు... అంజయ్య శత జయంతి సభ జరిగింది. పార్టీ జిల్లా నాయకులు ఉప్పుటూరు ప్రకాష్ రావు అధ్యక్షతన జరిగిన సభలో రావుల వెంకయ్య మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్రోద్యమంలోనూ, దేశ పునర్నిర్మాణంలోనూ కమ్యూనిస్టు పార్టీ గర్వించదగిన పాత్ర వహించిందని చెప్పారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే గాకుండా ప్రజా సంఘాలను నిర్మించి స్వాతంత్రోద్య మంలోకి ప్రజలను సమీకరించడంలో కమ్యూనిస్టు పార్టీ విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలకు స్వాతంత్రోద్య మంలో పాల్గొన్న ఆనవాళ్లు లేకపోయినా అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలు తాలూకా మారెళ్ళ గుంట పాలెంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మించటమే గాక, దళితుల పక్షాన నిలబడి తాగునీరు, వేతనాల పెంపునకు చరిత్రాత్మక పోరాటాలు నిర్మించిన ఘన చరిత్ర అంజయ్యదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అజ్ఞాతవాసంలోకి వెళ్లాడని గుర్తు చేశారు. ఆయన జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి దిక్సూచిగా ఉంటుందని చెప్పారు. ప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గాంధీ, నెహ్రూ వంటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకులను సహించలేకపోతున్నదని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, ముప్ప రాజు అన్నపూర్ణ ప్రసంగించారు. అనంతరం నల్లూరి వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. అతిథులను ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు పావులూరి అంజయ్య వేదిక మీదకి ఆహ్వానించారు.

పని కాపాడుకుంటూ ఉద్యమించాలి

పాలకుల దుర్మార్గపు ఆలోచనలను తిప్పికొట్టాలి

రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తూ... కార్మిక లోకాన్ని విస్మరిస్తూ... కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. సాంకేతికత పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పని కాపాడుకుంటూ కార్మిక హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ శ్రీకాకుళం జిల్లా 15 మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక డైమండ్ పార్క్ నుంచి మునిసిపల్ గ్రౌండ్ వరకు కార్మిక శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు టి.తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎందరో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను నేటి పాలకులు వారికి అనుకూలంగా మార్చుకుంటూ పోతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను మార్చేందుకు తీసుకుంటున్న చర్యల పట్ల కార్మిక లోకం ఉద్యమాన్ని తీవ్రతరం చేసి, పాలకుల దుర్మార్గ ఆలోచనలను తిప్పికొట్టేలా ఉద్యమించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుపరమైతే ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా వస్తాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక లోకందేనని అన్నారు. దేశ అభివృద్ధి యువత, కార్మికుల చేతుల్లోనే ఉందన్నారు. కార్మిక లోకం కన్నెర్ర చేస్తే గతంలో ఎన్నో ప్రభుత్వాలు కూలిపోయిన చరిత్ర ఉందని, మరలా ఉద్యమాలతో ఆ చరిత్రను తిరగరాయాలని పిలుపునిచ్చారు. కార్మిక లోకం అభ్యున్నతికి ఏఐటీయూసీ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని రవీంద్రనాథ్ తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు కార్మికుల సహకారం అవసరం : ఎమ్మెల్యే గొండు శంకర్

ఉత్తమ పరిశ్రమల స్థాపనకు కార్మికుల సహకారం ఎంతో అవసరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఏఐటీయూసీ జిల్లా మహాసభలో ఎ పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వలసల జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు, నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు, యువతకు ఉపాధి కల్పించేందుకు, పరిశ్రమలు వచ్చేందుకు కార్మిక సంఘాలు కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు. త్వరలో రూ.వెయ్యి కోట్లతో బీచ్ శాండ్ పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. సామాన్యులకు కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఏఐటీయూసీ నాయకులు చిక్కాల గోవిందరావు, శేషు, టి.ముత్యాల రావు, డి.కిరణ్, వై.సూర్యనారాయణ, బి.అప్పలరాజు, లబ్బ రాజు, కె.అప్పలరాజు, పార్థసారధి, వాసుదేవరావు, సునీత, సూర్య కళా, సీతమ్మ, షేక్ భాను, లక్ష్మి, రామ చంద్ర, రసూల్, సురేష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదీ త్యాగ రాజకీయమంటే...

అశోక్‌గజపతిరాజుకు సీపీఐ జాతీయ నాయకులు నారాయణ అభినందన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుకు చెందిన తన సొంత ఆస్తి నుంచి దాదాపు రూ.1,000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వడం పట్ల సీపీఐ సీనియర్ నాయకులు డాక్టర్ కె.నారాయణ అభినందనలు తెలిపారు. ఇది నేటి పాలకవర్గ రాజకీయాల కుళ్లిపోయిన స్థితిని బయటపెట్టారని, ప్రతిఫలంగా ఒక్క రూపాయి తీసుకోకుండా చేసిన నిర్ణయం నేటి దోపిడీ రాజకీయాలకు గుణపాఠం లాంటిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో రూపాయి పెట్టుబడి పెట్టి, తద్వారా కోట్ల రూపాయలు సంపాదించే ఆలోచన ఉన్న తరుణంలో కేవలం అశోక్‌గజపతిరాజుకు చెందిన రూ.1,000 కోట్ల విలువైన సొంత భూమిని ఉచితంగా ఇవ్వడం ద్వారా రాజకీయాల్లో ఆదర్శవంతులుగా నిలిచారని తెలిపారు. బూర్జువా రాజకీయ నాయకులు ఎన్నికలను పెట్టుబడులుగా భావిస్తూ, అధికారాన్ని ప్రజా వనరులను దోచుకోవడానికి, భూమిని లాక్కోవడానికి, సహజ సంపదను దోచుకోవడానికి, కార్పొరేట్ యజమానులకు సేవ చేయడానికి ఉపయోగించే ప్రస్తుత కాలంలో అశోక్‌గజపతిరాజు చేసిన దానంతో వారంతా సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. సమాజం అశోక గజపతిరాజును అభినందించాలని కోరారు.

అశోకగజపతిరాజుకు అభినందనలు : సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

గోవా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోకగజపతిరాజుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అభినందనలు తెలిపారు. విశాఖపట్నం భీమిలీ వద్ద ఏవియేషన్ ఎడ్యూసిటీ ప్రాజెక్టు కోసం రూ.1,000 కోట్ల విలువైన 136.63 ఎకరాల తన స్వంత భూమిని అశోకగజపతిరాజు ప్రభుత్వానికి ఇవ్వడం నేటి రాజకీయాలకు ఆదర్శనీయమని తెలిపారు. ఆయన ముందునుండీ కూడా తనకు ఏనాడూ అవినీతి మరక అంటకుండా విలువలతో కూడిన రాజకీయాలు నడిపారన్నారు. రాజకీయ అవినీతి, అక్రమాలు తారాస్థాయికి చేరిన నేటి పరిస్థితులలో ఆయన రాజకీయ నేపథ్యం అందరికీ అదర్శనీయమని పేర్కొన్నారు. అశోకగజపతిరాజు తండ్రి గారు పీజీ రాజు రాజవంశంలో జన్మించినప్పటికీ, సోషలిస్టు పార్టీలో చేరి సోషలిస్టు విధానాలు అవలంభించారని గుర్తు చేశారు. అశోకగజపతిరాజు విజయనగరంలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా అవసరాల కోసం వేల కోట్ల రూపాయల ఆస్తులను ఇచ్చారని తెలిపారు. రాజకీయాల్లో అత్యంత విలువలు పాటించి సమాజానికి అశోకగజపతిరాజు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. అశోకగజపతిరాజుకు సీపీఐ పక్షాన రామకృష్ణ అభినందనలు తెలిపారు.

తొలగించిన వర్కర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: మెడికల్ విభాగంలో తొలగించిన 50 సంవత్సరాలు నిండిన శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు జె. రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నిబంధనను ఉపసంహరించుకోవాలంటూ గత నెలలో హైకోర్టును ఆశ్రయించగా తీర్పు అనుకూలంగా వచ్చిందని, దీని ప్రకారం తొలగించిన కార్మికులను తిరిగి నియమించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కోర్టు తీర్పును స్వాగతించారు. అనంతపురంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలను కోరారు. ప్రభుత్వ రంగంలో 62 సంవత్సరాల సర్వీసు ఉండేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.రాజేశ్ గౌడ్, కృష్ణుడు, చిరంజీవి, మనోహర్, శోభ, వెంకటేశ్, రామాంజనేయులు, లక్ష్మీదేవి, ఫైమీదా, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరపున పోరాడిన

నిజమైన విప్లవకారులు మార్క్సిస్టులే

గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి గండి

అటవీ చట్టాల రద్దుకు మోదీ కుట్ర: సీపీఎం నేత బీవీ రాఘవులు

విశాలాంధ్ర-చింతూరు: ప్రజల తరపున పోరాడిన నిజమైన విప్లవకారులు మార్క్సిస్టులు... మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అనుసరించిన కమ్యూనిస్టులేనని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులు ఉన్నాయంటే సీపీఎం పోరాట ఫలితమేనన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు అమరవీరుల స్ఫూర్తితో సిద్ధం కావాలని యువతకు రాఘవులు పిలుపునిచ్చారు. సీపీఎం అమరవీరుల సంస్మరణ సభ ఆదివారం చింతూరులోని ప్రభుత్వ వైద్యాధికారి ప్రాంగణంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగింది. సీపీఎం నేత బత్తుల భీష్మర రావు భార్య హైమావతి రచించిన భీష్మ రావు పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. రాఘవులు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ప్రజల కోసం పనిచేస్తున్న బత్తుల భీష్మ రావు, బందారు చంద్రావును మావోయిస్టులు చంపారని గుర్తు చేశారు. శ్యామల వెంకటరెడ్డి, పులిరామయ్య, పట్రా ముత్యం వంటి వారు హత్యకు గురయ్యారన్నారు. కుంజా బుజ్జి, సున్నం రాజయ్య వంటి 30 మంది నాయకులు ఓవైపు పాలకులు మరోవైపు మావోయిస్టుల నిర్బంధాలను ఎదుర్కొని గిరిజన ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. తుపాకులతో విప్లవం రాదని, అది ప్రజలతోనే సాధ్యమని పుచ్చలపల్లి సుందరయ్య తదితర ముఖ్య నేతలు సైద్ధాంతికంగా వివరించారని రాఘవులు వెల్లడించారు. తుపాకుల ద్వారా విప్లవం అంటే ప్రజలకు ద్రోహం చేయడమేనని, అటువంటి విధానంతో విప్లవానికి ద్రోహం- పాలకులకు మేలు జరుగుతాయని గతంలోనే హెచ్చరించామన్నారు. హిడ్మా లాంటి అనేకమంది మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రశ్నార్థకమన్నారు. ఇప్పటికైనా మించింది లేదని ప్రజాస్వామ్యబద్ధ పోరాటాలలో కలిసి వచ్చి వామపక్ష ఐక్యత చాటాలని రాఘవులు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం పేరుతో కాంట్రాక్టర్లకు దోచి పెట్టేందుకు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పోటీ పడుతున్నట్లు విమర్శించారు. ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు అంటే చైతన్యానికి, పోరాటాలకు మారుపేరన్నారు. జీవో 3 కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని 100 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యోగి ఆదిత్యనాథ్ పాలన తెస్తామంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. యోగి పాలనలో తలసరి నేరాల రికార్డు ఒకరిపై ఏడున్నర కేసులని దుయ్యబట్టారు. అలాంటి పాలన అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిస్తారని హెచ్చరించారు.

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక

సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావలెను

74 సంవత్సరాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో పని చేయడానికి సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావాలి.

సీనియర్ జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్టులకు అనుభవానికి తగిన వేతనం ఇవ్వబడును. ఆసక్తిగలవారు నేరుగా విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం, చంద్రం బిల్డింగ్స్, విజయవాడలో 2025 డిసెంబరు 27వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావలెను. వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

ట్రైనీ సబ్ ఎడిటర్లు

అర్హతలు : తెలుగులో రాయగల నేర్పు, ఆంగ్లభాషపై అవగాహన కలిగి ఉండాలి. లోకజ్ఞానం, వర్తమాన వ్యవహారాలపై పట్టు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్న తపన, పాత్రికేయ రంగం పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. జనవరి 1, 2026 నాటికి 30 ఏళ్ళ వయసు మించనివారై, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన వారై ఉండాలి.

ట్రైనీ సబ్‌ఎడిటర్లకు శిక్షణకాలంలో మొదటి సంవత్సరం రూ. 14,000, ఆ తర్వాత ప్రొబేషన్ పీరియడ్‌లో రూ. 15,000 చొప్పున నెలవారీ భృతి ఇవ్వబడును. అనంతరం ప్రతిభ ఆధారంగా వేతనం నిర్ణయించబడును. దరఖాస్తును e-mail : editorvisalaandhra2026@gmail.com మెయిల్‌కు, లేదా ఈ క్రింది చిరునామాకు ఫొటోతో సహా పంపించవలెను.

చిరునామా : ఎడిటర్, విశాలాంధ్ర జాతీయ దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావు రోడ్డు, చుట్టుగుంట, విజయవాడ - 520004,
వివరాలకు ఫోన్ నెంబర్ : 9590952106, 7997014006
e-mail : editorvisalaandhra2026@gmail.com

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.